2015 మార్చి

# పరిశుద్ధత

ఆధ్యాత్మిక క్రైస్తవ మాసపత్రిక

ప్రధాన సంపాదకులు :

**రెవ.డా॥ కె. జోసఫ్**

సర్క్యులేషన్ :

**సామ్రాట్ కొడవటికంటి**

**చందా వివరములు :**

సంవత్సర చందా రూ. 150/-

పోషక చందా రూ. 1000/-

జీవిత చందా రూ. 3000/-

విడి ప్రతి రూ. 15/-

**మా చిరునామా :**

ఎడిటర్, పరిశుద్ధత

పోస్ట్‌బాక్స్ నెం. 28

ఒంగోలు - 523001

ఫోన్ : 08592-231281

సెల్ : 9704255416

## లోపలి పేజీల్లో...


సంపాదకీయం 02
ఎడిటర్
అపొస్తలుడు కొడవటికంటి 03
లియో టాల్‌స్టాయ్ ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ 06
నీతిపరుడైన.... మామయ్య కథలు 09
ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్
ది డే ఆఫ్ రిడమ్షన్
రెవ.డా॥కె. జోసఫ్ 11
సాక్ష్యము 13
ఆత్మలు-క్రియలు ఎ. మత్తయి, వినుకొండ 14
దేవుడు పండుగల ద్వారా మాట్లాడును 18
బ్రదర్ కె. సామ్రాట్‌గారు
యేసు మరణించి తిరిగి లేచాడు 19
రెవ. డా॥ కొడవటికంటి విక్రాంత్
జాన్ వెస్లీ శ్రీమతి రిబ్కా విక్రాంత్ 21
అక్షరయజ్ఞం - బైబిల్ క్విజ్ 24
శ్రీమతి కె.ప్రసన్న పరాక్రమ్‌గారు


India Evangelistic & Relief Fellowship

| **EVANGELISM** | **RELIEF** |
|---|---|
| Church Planting | Orphanage |
| Evangelestic, Crusades | Child Development Centers |
| Pastor's Seminars | Education (U.C.L.I. Schools) |
| Youth Ministry | Widows & Leprosy Care |
| T.V.Ministry | Medical Assistance |
| Magazine Ministry | Help in Natural Calamity |
| Audio Ministry | Flood Relief |
| Jail & Prison Ministry | Mobile Medical Ministry |
| IERF International | Children Care Ministry |
| Hanna Women Ministries | |

**ప్రకటన రేట్లు**

| | | |
|---|---|---|
| టైటిల్ 4వ పేజీ | ..... | రూ. 3,000/- |
| టైటిల్ 3వ పేజీ | ..... | రూ. 2,000/- |
| లోపలి పేజీ | ..... | రూ. 1,000/- |

# సంపాదకీయం.....



అప్పుడే మార్చి నెలలో ప్రవేశించాము. పరీక్షలు వ్రాయడానికి ఈ నెల కొరకు విద్యార్థులు ఎదురు చూస్తున్నారు.  పరీక్షలు, టెన్షన్లు. ఎప్పుడూ ప్రార్థించని వారు కూడా ప్రార్థనలు చేస్తున్నారు.

క్రొత్త మనల్ని భయపెడుతుంది. రేపటి రోజు మానవులకు క్రొత్తరోజు. రేపు ఇంతకముందు ఎన్నడూ రాలేదు. మరలా మన కొరకు రాదు. మనల్ని వెంబడిస్తూ, భయపెడుతూ వస్తున్న క్రొత్తరోజును చూసి భయపడవద్దు అన్నాడు ప్రభువు. రేపటిని గూర్చి చింతింపకుడి రేపటి దినము దాని సంగతులను గూర్చి చింతించును అన్నాడు.

అసలు మనుష్యులు భయపడటానికి ముఖ్యకారణం దేవుని మరచిపోవటం. మనం మరణించేటంత వరకు మనల్ని విడువక ఎడబాయక కాపు కాస్తున్న దేవుని వాగ్ధానాన్ని గ్రహించకపోవటం. యెహోవా నా కాపరి అని నమ్మకపోవటం. కొందరు అన్ని విషయాలలో సమృద్ధిగా ఉండినా, వారికి రేపు అనే విషయం ఆందోళన కలిగిస్తుంది. కొందరు వచ్చేవారం గురించి, మరికొందరు వచ్చే నెల గురించి, మరి కొందరు వచ్చే సంవత్సరం గురించి భయపడతుంటారు. అందుకే ప్రభువు ఏనాటి కీడు ఆనాటికే చాలును అన్నాడు. అంటే మనం ఈ రోజు విషయం సంతృప్తి కలిగి ఉండమని. అన్నిటికంటే ముఖ్యమైనది మనం విడిచి వచ్చిన మార్గము మనం మరచిపోతుంటాము. మనం నడవబోయే మార్గాన్ని గురించి దిగులు పడటానికి కారణం ఇదే. కాబట్టి ప్రతి ఒక్కరూ ప్రభువునుబట్టి ధైర్యముగా ఉండమని మనవి చేస్తున్నాను.

పత్రిక చందా 150/- రూపాయలకు పెంచామన్న విషయం మరోసారి గుర్తుచేసున్నాను. మీరు చందా కట్టటం వలన పత్రికను అనేకమందికి పంపడానికి అవకాశం ఉంటుంది. వచ్చే సంచికతో పాటు మనీయార్డరు ఫారం పంపిస్తాము. చందా కట్టాలనుకున్న వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోగలరు. పత్రికను మీ బంధువులు, స్నేహితులకు పంపాలనుకుంటే మాకు పోస్టుకార్డ్ ద్వారా కాని, ఫోన్‌చేసి కాని తెలియజేయండి. సెల్ నంబరు : **9704255416, 8297715298** దేవుడు మిమ్మును దీవించును గాక!

**–ఎడిటర్**

సీరియల్

# అపొస్తలుడు

12

– కొడవటికంటి

"చెప్పండి – అది ఏమి మాట?" అని అడిగాడు సౌలు. తను ఇప్పుడు యేసును గురించి వింటున్నానని అనుకోవటం లేదు. కానీ, ఒక రోమీయుని మనసు, యూదుని వైపుకు త్రిప్పిన ఆ మాట ఏమై ఉంటుంది? అనుకున్నాడు.

"తండ్రీ వీరేమి చేయుచున్నారో వీరెరుగరు కనుక వీరిని క్షమించుము అని అన్నాడు" అజల్యా లేచి, "ఇక వెళ్ళి వస్తానండి" అని ఒలీవల కొండవైపుకు నడిచివెళ్ళాడు.

సౌలు వెళుతున్న అజల్యా వైపు చూస్తూ కూర్చున్నాడు. 'తండ్రి వీరేమి చేయుచున్నారో వీరెరుగరు కనుక వీరిని క్షమించుము' అని మనస్సులో అనుకొనినట్లుగా పైకి అనేశాడు.

'యేసు' అని అనుకున్నాడు. ఈ నామము తన హృదయములో నెమ్మది లేకుండా చేసింది. తననే కాదు, ఆ నామము ఉచ్చరించిన ప్రతి స్థలము అలలురేగిన సముద్రము అయిపోతుంది.

'ఈ నామము భరించలేనిది. తన జీవితంలో నుంచి మాత్రమే కాదు, ఈ నేలమీద నుండి ఈ నామము ఎంత తొందరగా తుడుచుకొనిపోతే అంతమంచిది' అనుకున్నాడు.

"తండ్రీ వీరేమి చేయుచున్నారో వీరెరుగరు కనుక వీరిని క్షమించుము. మళ్ళీ తన చెవులలో ఎవరో చెప్పినట్లుగా అనిపించింది.

సౌలు లేచి నిలబడ్డాడు. తొందరగా తన గదికి వెళ్ళి నిద్రపోవాలి. మామూలుగా భోజన సమయంలో తీసుకొనే ద్రాక్షారసం కంటే ఈ రోజు కొంచెం ఎక్కువగానే తీసు కున్నాడు. తల కొంచెం బరువుగా తోచింది. యేసును గురిం చిన ఆలోచన వలనా? లేక తను త్రాగిన ద్రాక్షారసం వలనా? ఏది ఏమైనా ఈ పరిస్థితి నుండి తప్పించుకొని వెళ్ళిపోవాలి అనుకున్నాడు.

అటుగా వచ్చిన గుర్రపు బగ్గీని పిలిచి కూర్చున్నాడు. "గమలియేలుగారి ఆశ్రమము" అన్నాడు. బగ్గీ యెరూషలేముకు దక్షిణంగా తిరిగి, దేవాలయమును చుట్టుకొని ఆశ్రమానికి వచ్చింది.

సౌలు డబ్బులు బగ్గీవాని చేతిలో పెట్టి భారంగా అడుగులు వేసుకొంటూ గదిలో మంచం మీద పండుకొన్నాడు. కొంచెం సేపు విశ్రాంతిగా పండుకొని లేచి, వస్త్రాలు మార్చుకొని తలపాగాతీసి గోడకి ఉన్న కొక్కెమునకు తగిలిస్తుంటే తన భార్య మీరా గుర్తుకువచ్చింది. ఈ పాగా తన తలమీద పెట్టేటప్పుడు, తన కండ్లలోకి చూసినప్పుడు ఆ చూపు పదార్థమై తన హృదయములోకి ప్రవేశించింది.

ఎప్పుడు తన భార్య 'మీరా' మదిలో మెదలినా ఆ చూపే గుర్తుకు వస్తుంది. ప్రయాణమైనప్పుడు తనే ఆ పాగ తలమీద పెడుతున్నప్పుడు – అదే చూపు తనని వెంటాడుతూనే ఉన్నది.

ధర్మశాస్త్రానుసార జీవితం జీవించేటప్పుడు – నిష్ఠ కలిగిన పరిసయ్యులలో శ్రేష్ఠుడుగా ఉండాలనే తపనతో ధర్మశాస్త్రము కంఠస్తము చెయ్యటం, చదవటం ప్రవక్తల గ్రంథాలలోని మర్మాలు తెలుసుకొనుటలో దేవుడు మానవులలో రెండు తెగలు సృజించాడు. కాని ఆ రెండు జాతులు ఒకరిమీద ఒకరు ఆధారపడి జీవిస్తారని గ్రహించలేదు. ఆ విషయం ఆలోచించడానికి తగిన స్నేహితుడు లేరు. ఎవరితోనైనా మాట్లాడదామన్నా భయం. పరిసయ్యుడు – రబ్బీగా రూపొంద వలసిన వాడు, ఈ విషయాలు మనస్సులోకి రావటం కూడా పాపమే అనిపించేది.

నిష్ఠగా జీవితం గడపటానికి తన ఇష్టాఇష్టాలు అన్నీ ఆ జీవితానికి అనుగుణంగా, మలచుకొన్నాడు. కొంతకాలానికి జీవితం అంటే ఇదే అనిపించింది.

సంవత్సరం క్రితం తన భార్య మీరాని పెళ్ళాడినప్పుడు కూడ మరో సృష్టితో కలసి క్రొత్త జీవితం తయారవుతుంది అనుకొన్నాడు. తను ఊహించినట్లుగా ఆమె అతిగా సిగ్గుపడలేదు. పైపెచ్చు ఎన్నో బాధ్యతలు నెత్తిమీద పడిన 'ప్రౌఢ'లా ఉంది. తనకంటే చాలా చిన్నదైనా, ఎంతో పెద్ద అనుభవశాలిగా పనివారి విషయాలు, వ్యాపార విషయాలు, ఇంటి విషయాలు చూసుకొంటున్నందున తన తండ్రి ఇంటివారందరిరీ సంతోషం కలిగించింది.

ఆమె లేని కొరత ఇప్పుడు స్పష్టంగా కనబడుతుంది. వివాహ జీవితం మొదలయినప్పటికి తను, తన బాధ్యతలు – అంటే రబ్బీ పట్టకోసం తను చేయవలసిన గ్రామసేవ మరువలేదు. వివాహం వల్ల ఏర్పడిన సంభ్రమాలు, సందడికి నెల రోజులు గడుపు దాటగానే తనమీద అధికారిగా ఎవరూ లేకపోయినా, తన మనస్సాక్షికి లోబడి గ్రామాలలో ధర్మశాస్త్ర ప్రబోధాలు కొనసాగించాడు.

తన భార్యతో సాంగత్యం ఈ విధి నిర్వహణలో అడ్డురా నీయలేదు. మీరా అడ్డు పెట్టలేదు. పూర్ణ హృదయముతో యెహోవాను ప్రేమించవలెను అనే ఆజ్ఞలో కూడ ఎవరూ పాలుపంచుకోనీయలేదు. కొంతమందికి కొన్ని సమయాలలో తన జీవితం ఛాందసంగా కనిపించినా తను ఏర్పరచుకొనిన 'గురి' ఏ సందర్భంలో అయినా పరిస్థితులతో రాజీపడలేదు. ఇలా ఆలోచిస్తూ నిద్రపోయాడు.

సౌలుకు సూర్యోదయమైన గంట సేపటికిగాని మెళకువ రాలేదు. మెళకువ రాగానే ఆలస్యంగా నిద్రలేచి నందుకు సిగ్గుపడ్డాడు. బయటకు వస్తే క్రొత్తగా ఆశ్రమంలో చేరిన విద్యార్థులకు తను ముఖం చూపించాలి. అందుకని ఆలో చిస్తూ కిటికీ దగ్గర కుర్చీలో కూర్చొని బయటకు చూస్తూ ఉన్నాడు.

తలుపు కొద్దిగా శబ్ద అయ్యింది. తలుపు దగ్గర 'అర్థోను' నిలబడి ఉన్నాడు. 'అర్థోను'ను చూస్తే సౌలుకు చాల సంతోషంగా ఉంటుంది. యజమానికి తగిన నౌకరు. నౌకరు – స్నేహితుడు ఆర్థోనే. గమలియేలుగారి భార్య చనిపోయిన తర్వాత ఆయన మరలా వివాహం చేసుకోలేదు. తన కుమారుడు 'సిమి యోహాను'ను కూడ 'అర్థోను' చేతిలో పెట్టాడు.

యెరూషలేములో సర్వ సభ అధ్యక్షుడు, గౌరవ సభ్యుడు అని పిలువబడే గమలియేలుగారు 'కాబాలా' అనే గ్రంథ గ్రహీతులలో ముప్పై అయిదోవాడు. ఈ గ్రంథము సీనాయి పర్వతము మీద దేవుని నుండి మోషే గ్రహించినది అని చెప్పబడుతుంది. తన తాత అయిన 'హిల్లాలు' గొప్ప గౌరవస్థానము కలిగినవాడు. తన తండ్రి సిమోను గారికి ఉన్నంత గొప్ప స్థాయికి చేరుకోలేకపోయినా గమలియేలుగారు 'హిల్లాలు' యొక్క స్థితి కలిగి ఉన్నారు.

గమలియేలుగారి ధర్మశాస్త్ర పాండిత్యములో తొంభై భాగములు తర్ఫీతు లేకుండానే 'అర్థోను' సంపాదించాడు. ఎంతో దయ కలిగిన సాత్వికుడు 'అర్థోను'. గురువుగారి యొద్దనుండి వస్తున్నట్లుంది. "అయ్యగారు రాత్రి ఊరి నుండి వచ్చారు. మీరు యెరూషలేము వచ్చిన సంగతి తెలుసుకొని చాలా సంతోషించారు. రెండవ జాములో మొదటి ఘడియ మిమ్మల్ని చూస్తాను అని చెప్పారు" అని చెప్పి వయసుకు తగిన నడకతో వెళ్ళిపోయాడు.

గమలియేలుగారు తన వంశమును బట్టి గొప్పవాడని ఎవరూ అనరు. తన వంశమునకున్న గొప్పతనము కర్మేలు పర్వతమైతే, గమలియేలుగారి వ్యక్తిగత స్థాయి హెర్మోనుకొండ వంటిది. జీవితంలో దేవుని ద్వారా తను సంతరించుకొనిన యోగ్యతలలో గమలియేలువంటి ఉత్తముని యొద్ద శిష్య రికము చేయగలగటం ముఖ్యమైనది.

సౌలు కాలకృత్యములు తీర్చుకొని, అల్పాహారము తీసు కొని సిద్ధపడి మెట్లు దిగి, క్రింద ఉన్న మండపం దగ్గర రాతిబల్లమీద కూర్చున్నాడు. ఇంకా గమలియేలుగారి దర్శ నమునకు ఒక గంట సమయం ఉంది. వేరొక బల్లమీద ఇద్దరు యూదులు – తన వయస్సే ఉండి ఉంటుంది. కూర్చొని గ్రీకు భాషలో మాట్లాడుకొంటున్నారు. వారి వేష భాషలనుబట్టి వారు కుప్రీయులు అయివుంటారు అనుకున్నాడు.

కొంచెం సేపయిన తరువాత వారు సౌలు వైపు చూచారు.

సన్‌హెడ్రిన్ సభ సభ్యుని గుర్తుగా, తలమీద పాగాకు చుట్టిన చెంగావి రంగు దారం చూసి పొరపాటుచేసిన వారిలా లేచి నిలబడి, సౌలు దగ్గరగా వచ్చి నమస్కారం చేశారు.

"ఏ ఊరు?" అని అడిగాడు సౌలు.

"లిబర్తీనులు" అన్నాడు వారిద్దరిలో చిన్నవాడు.

"లిబర్తీనులు అంటే కూషు దేశములో ఒక జిల్లా కదా!?" అన్నాడు సౌలు.

"పెంతుకోస్తు పండుగకు తలనీలాలు ఒప్పుకొన్నాము. అందుకు వచ్చాము" అని అన్నాడు సౌలువైపు చూసి. కొంచెం నిదానంగా చూస్తూ... "మిమ్మల్ని ఒక విషయం అడగమంటారా?" అన్నాడు సందేహిస్తున్నట్లుగా...

"చెప్పండి" అన్నాడు సౌలు.

"దేవునికి కూడ భార్య, పిల్లలు వుంటారా?" అని అన్నాడు. సౌలు ఆశ్చర్యంగా చూసాడు.

"అవునండి. యెహోవా దేవునికి ఒక కుమారుడు ఉన్నాడట. ఆయన ఈ భూమిమీద మనుష్యుని అవతారం ఎత్తాడట. ఆయన యందు విశ్వాసం ఉంచితేనే పరలోక రాజ్యంలో ప్రవేశమట" అన్నాడు కోపంగాను, విచారంగాను. కొంచెం ఆగి – ఈ విధంగా ప్రచారం చేస్తున్నది కూడ యూదులే! ఇంతకంటే దేవదూషణ ఏమున్నది?" అన్నాడు వారిలో చిన్నవాడు.

"రోజులు మారిపోయాయి. పూర్వం ఎవరైనా ఇందులో వందో వంతు మాట్లాడినా దేవదూషణ క్రింద రాళ్ళతో కొట్టి చంపేసేవాళ్ళు. అయితే ఈనాడు మత సంరక్షకులే మౌనం ఎందుకు వహిస్తున్నారో అర్థం కావడం లేదు. పుణ్యక్షేత్రమని, పవిత్ర దేవాలయము ఇక్కడ ఉందని, ఇన్ని నెలలు ప్రయాణం చేసి వచ్చిన మాకు దేవదూషణ, దైవ తిరస్కారము ఎదురయ్యాయి. వీటిని ఇక్కడ ఆపకపోతే మా ప్రాంతాలకు కూడ ప్రాకి, పూర్తిగా వర్ణ సంకరం అయిపొతాయి" అని ఆక్రోశించాడు.

"మేము కాని యెరూషలేము వాసులమైతే – ఈ దేవ దూషకులను ఆదిలోనే త్రుంచివేసే వాళ్ళము" అన్నారు ఇద్దరు ఒక నిర్ణయానికి వచ్చినట్లు.

"అంతమాత్రపు వాళ్ళు ఇక్కడ వాళ్ళైతే ఐదువేలమంది యేసు శిష్యులు ప్రతిదినం దేవాలయములో కూడుకొన గలరా?" అని అన్నాడు.

ఇంతలో 'అర్ఖోను' ఇటుగా రావటం సౌలు గమనించి వారిద్దరి నుండి 'అర్ఖోను' వైపుగా కదిలాడు. అర్ఖోనుతో కలసి ముఖద్వారములోకి ప్రవేశిస్తూ, సౌలు వెనుకకు తిరిగి మండపం వైపు చూసాడు. ఇప్పుడా ఇద్దరుకాక పదిమంది అయ్యారు. వారి ముఖాలు కూడా 'లిబర్తీనులు' వలే ఉన్నాయి. వారు కోపంగా మాట్లాడుకొంటున్నారు.

అంత లావుగాను కాకుండా, సన్నగాను కాకుండా నెరసిన గడ్డంతో పరుపుమీద కూర్చొని, దిండుమీద మోచెయ్యి ఆనించి, గడ్డం క్రింద కుడిచెయ్యి ఆనించి సౌలు కోసం చూస్తున్నారు గమలీయేలు. తలమీద ఉన్న పాగా కంటే తెల్లని వస్త్రం – ఇక ఎవరి దగ్గర కనిపించదు అన్నంత తెల్లగా ఉన్నది.

సౌలును చూడగానే గమలీయేలు గారి ముఖం చేటంత అయింది. సౌలు వాకిట్లో నిలుచుని భక్తి పూర్వకంగా వంగి నమస్కారం చేసాడు. గమలీయేలుగారి ముఖం కనబడగానే బయట ప్రపంచం తన మస్తిష్కం నుండి మాయమైపోయింది. ఇప్పుడు తన మనస్సులో తార్సులేదు. యెరూషలేము లేదు, సన్‌హెడ్రిన్ సభ లేదు – కేవలం చిన్న పిల్లవాడు. తన తండ్రి దగ్గరున్నట్లుగా అనిపించింది.

గమలీయేలుగారి దగ్గరగా వచ్చి, ఆయన పాదాలు అంటి ప్రక్కగా కూర్చున్నాడు. గమలీయేలుగారు ఏమి కదలలేక పోయినా తన చేతితో సౌలు తలమీద తాకినట్లుగా అనిపించింది. గమలీయేలు గారు సౌలును చూస్తూ కొంచెంసేపు ఆలోచనలో పడ్డారు.

**(సశేషం)**

Read Our Internet Edition @
**www.holinessmagazine.com**

సీరియల్

# ఫాదర్ సర్గీస్

## (లియో టాల్‌స్టాయ్)



**1840 సంవత్సరములో** పీటర్స్‌బర్గ్‌లో ఒక ఆశ్చర్యకరమైన సంఘటన జరిగింది. ఎంపరర్ మొదటి నిఖలాస్ ఏలుబడిలో ఎయిది కేంప్‌లో ఓ పెద్ద ఆఫీసర్‌గా నియమింపబడబోయే రాజకుమారుడు స్టీఫెన్‌కు రాజగృహములో నివశించే ఓ అందమైన అమ్మాయితో వివాహము నిశ్చయమైన సమయంలో స్టీఫెన్ అన్నిటిని వదులుకొని సాధువుగా మారిపోయి ఓ ఆశ్రమమునకు వెళ్ళిపోయాడు. అతను ఎందుకిలా చేశాడో ఎవరూ ఊహించలేకపోయారు. కాని స్టీఫెన్ మాత్రం ఇదంతా సాధారణంగా జరిగినట్లుగానే భావించాడు.

స్టీఫెన్‌కి పన్నెండు సంవత్సరముల వయస్సులో అతని తండ్రి కల్నల్ ఆఫ్ గార్డ్సులో పనిచేస్తూ మరణించాడు. తండ్రి కోరిక ప్రకారం అతని తల్లి అతనిని మిలటరి పాఠశాలలో చేర్పించింది. అందును బట్టి కుమారునికి కొంచెం చేరువలో ఉండాలని అతని తల్లి తన కుమార్తె కరవలాతో కలసి పీటర్స్‌బర్గ్‌లో నివశించసాగింది.

స్కూలులో చేరిన నాటనుండి స్టీఫెన్ లెక్కలలోను, వ్యాయామము లోను, గుర్రపు స్వారిలోను ప్రతిభ చూపించసాగాడు. అందముగా పొడవుగా ఉండి ఎటువంటి దురలవాట్లకు లోనుకాకుండా మంచివ్యక్తిగా పేరు సంపాదించాడు. చిన్నతనములో కోపం వచ్చినప్పుడు మృగమువలె ప్రవర్తించేవాడు. ఒకసారి అమితమైన కోపంలో తన తోటి విద్యార్థిని కిటికీలో గుండా బయటకు విసిరి వేయబోయాడు. అతని పద్దెనిమిది సంవత్సరాల వయస్సులోనే గొప్ప పదోన్నతి కలిగింది. ఇతనిని చక్రవర్తి అయిన నిఖలాస్ గమనించి మెచ్చుకున్నందున స్టీఫెన్‌కు చాలా గొప్ప పదోన్నతి ముందు వేచియున్నదని అందరూ భావించారు. చక్రవర్తి వాళ్ళ కాలేజికి వచ్చినప్పుడు స్టీఫెన్ నిఖలాస్ ఆరాధ్యంగా గౌరవించేవాడు. చక్రవర్తి కాలేజికి వచ్చినపుడు అతను అక్కడున్న యవ్వనస్తులందరిని ప్రేమించేవాడు. స్టీఫెన్ అంటే ప్రత్యేకమైన ప్రేమ చూపించేవాడు. అది తలుచుకొని స్టీఫెన్ కన్నీటి పర్యంతమయ్యేవాడు.

స్టీఫెన్ పట్టభద్రుడైన తరువాత అతని తల్లి అతనిని కుమార్తెను తీసుకొని మాస్కోకి ప్రయాణమై తర్వాత తమ సొంత నివాసానికి వెళ్ళిపోయింది. స్టీఫెన్ తన ఆస్థిలో ఎక్కువ భాగము తల్లికి చెల్లెలికి ఇచ్చి తనకు అవసరమనుకొన్నంత మాత్రం ఉంచుకొన్నారు.

తను ఇంకా ఉన్నత పదవులు చదువుతూ – ఫ్రెంచి భాష కూడా నేర్చుకున్నాడు.

పట్టణ సమాజములో ధనవంతులైన వారి జాబితాలో స్టీఫెన్ ఒకడు. కమ్యూనిటి సెంటర్‌లో సాయం సమయం గడిపేవాడు. అక్కడ కోరోట్‌కోవా అనే యువరాణితో పరిచయము పెరిగింది. ఆమె చాలా అందగత్తె. ఆమె ప్రేమలో అతను ఉన్నతమైన ఆదర్శాలు కనుగొన్నాడు. ఇంకా తొందరలో తన జీవితంలో ప్రేమ ఫలిస్తుందని అనుకున్నాడు. ఆ అమ్మాయి తల్లి, అమ్మాయి కూడా ఏదో తనకు తెలియని దాపరికములో ఉన్నారని తెలిసినా స్టీఫెన్ మాత్రం పట్టించు కోలేదు.

కొన్నిరోజుల తర్వాత కోరోట్‌కోవాతో కలసి తోటలో కూర్చున్నాడు. కోరోట్‌కోవా – తెల్లని దుస్తులు ధరించి ఉంది. ఆమె హృదయం వలెనే ఆమె దుస్తులు కూడా మచ్చలేని వనిపిస్తుంది. పెండ్లి కాని యవ్వన స్త్రీలందరు కన్యకలని, పవిత్రమైన ప్రేమికులని స్టీఫెన్ తలచేవాడు. స్టీఫెన్ తన ప్రియురాలితో తోటలోని ఓ రాతి పలకమీద కూర్చున్నాడు. అతను భావోద్రేకతకు గురయ్యాడు. తన జీవితంలో ఇటు వంటి సన్నివేశము ఇదే ప్రథమం. అతను లేచి నిలుచున్నాడు. ఆమె రెండు చేతులు తన చేతిలోకి తీసుకున్నాడు.

"నాకు ఇటువంటి ఆనందం లోకంలో ఉన్నదని తెలియదు. ఇది నాకిచ్చినది నీవే" అన్నాడు.

"నీ సహవాసంలో నన్ను నేను కనుగొన్నాను.

నేననుకొనిన దానికంటే నేను ఇప్పుడు ఎక్కువ అయ్యాను" అన్నది.

ఆమె చేతిని తన చేతిలోకి తీసుకొని ముద్దు పెట్టుకున్న తర్వాత ఆమె అపవిత్రమైనదని బాధపడ్డాడు. అతని కండ్లలో నీళ్ళు తిరిగాయి.

ఆమె అతని వైపు జాలిగా చూసింది. అతను నిజంగా మనస్ఫూర్తిగా తనను ప్రేమిస్తున్నాడు. తను కూడ అతనిని ప్రేమిస్తోంది. ఇప్పుడు తను ఆయనకి నిజం చెప్పాలి లేకపోతే ఇక ఎప్పటికి చెప్పలేను అనుకొన్నది. స్టీఫెన్ ముఖంలోకి చూస్తూ "నిన్ను నేను మోసపుచ్చలేను. నేను ఇంతకుముందు ఒకసారి ప్రేమించబడ్డాను" అని అతని చేతిమీద తన చేతిని తీసివేసింది. "అతను చక్రవర్తి" అన్నది.

''ఔను! మనమందరము అతనిని ప్రేమిస్తాము, తప్పులేదు" అన్నాడు.

"నిజమే, కాని ఆ రకమైన ప్రేమకాదు. నేను అతనికి సమర్పించుకున్నాను. ఆయనకు అంతా ఇచ్చాను" అని రెండు చేతులతో ముఖం కప్పుకున్నది.

స్టీఫెన్ లేచి దూరంగా నడిచాడు. ఆమె అతని దగ్గరకు వచ్చి తన చేయి అతనిమీద వేసింది. అతను దూరంగా జరిగి ''నన్ను తాకవద్దు. నన్ను తాకవద్దు'' అని వణికిపోతున్నాడు. ఆమె చేతిని ప్రక్కకు నెట్టి గబగబ ఇంట్లోకి వెళ్ళాడు.

ఆ అమ్మాయి తల్లి ఎదురువచ్చింది. అతని ముఖం చూసి "ఏమయింది స్టీఫెన్?" అన్నది.

అతను ఆగి "నువ్వు ఆడదానివి కాకుంటే ఈ రోజు ఏమైనా చేసేవాడ్ని" అని తన పిడికిలి పైకెత్తి ఆమె ముఖం వైపు చూశాడు. వెంటనే ప్రక్క వాకిలిగుండా బయటకు వెళ్ళిపోయాడు.

తన ప్రియురాలిని మొదట పొందినవాడు ఇంకెవరైనా అయితే ఈపాటికి అతనిని చంపియుండేవాడు. కాని అతను తను మిక్కిలిగా ప్రేమించిన చక్రవర్తి.

మరునాడు అతను తన ఉద్యోగానికి రాజీనామా వ్రాస్తూ తనకు అనారోగ్యము వచ్చింది. ఎవరిని కలవలేక పోతున్నాను అని వ్రాసి వెళ్ళిపోయాడు.

ఎండాకాలం గడిచేంతవరకు తన గ్రామములో ఉండి పనులన్ని చక్కబెట్టుకొని ఒక సన్యాసాశ్రమమునకు వెళ్ళి సన్యాసిగా మారాడు.

అతని తల్లి అతనిని తిరిగి రమ్మని ఎంతో ప్రాధేయపడింది. దేవుడు నన్ను ఈ పనికి పిలిచాడు. నావలె 'అహం' ఉన్న నా చెల్లెలికి ఈ సంగతి అర్థమవుతుంది అని జవాబు వ్రాశాడు. అతని హృదయములో తనకంటె ఉన్నతమైన స్థితిలో ఉన్నవారికంటే తను ఉన్నతుడైతేనే వారిని అధిగమించగలనని అలా చేశాడని అతని తల్లి భావించింది. అతని చెల్లెలు 'కరవలా' మరొకరకంగా భావించింది. అదేమి కాదుగాని తన ప్రేయసి రేపిన గాయాన్ని తను మరిచిపోయి స్థిరమైన హృదయం సంపాదించాలంటే మరోమార్గం దేవుడే! అతని చిన్ననాటి దైవభక్తి అతనిలోనుండి ఒక్కసారిగా పొంగినది అనుకుంది.

ఆ ఆశ్రమములో ఉండే పెద్ద గురువుకు తనను తను అప్పగించు కున్నాడు. బాహ్య జీవితానికి అంతర్గత జీవితానికి పూర్తి స్థైర్యము ఇక్కడే సంపాదించగలను అనుకున్నాడు. అతను తన్ను తాను తగ్గించుకున్నాడు. పగలు రాత్రి కష్టపడి పనిచేసేవాడు. హృదయంలో పవిత్రతకు, మనసులో యదార్థతకు స్థానము కల్పించాడు. అక్కడ నివశించే సన్యాసులను ఎవరిని తనకు మాదిరిగా తీసుకోలేదు. కాని తను అందరికంటే తక్కువవాడిగా భావించుకొని అందరిని ప్రేమించడం ప్రారంభించాడు. తనకి ఇష్టమున్నా, లేకపోయినా తనకంటే పెద్దవారు తనకు నియమించిన బాధ్యతలను సంతోషముగా స్వీకరించాడు. మొదట్లో కష్టంగా కనిపించినవన్ని కొంతకాలానికి సంతోషకరమైనవిగా మారినవి.

తన ఆస్థినంతా తన చెల్లెలికి రాసి ఇచ్చాడు. ఇప్పుడు తను ఆలోచించవలసినది ఏమీలేదు. తనకంటే తక్కువ స్థితిలో ఉన్నవారి దగ్గర దీనుడై ఉండడంలోని సంతోషాన్ని గ్రహించాడు. శరీరాశలమీద కూడా జయము సాధించాడు.

చాలాకాలం వరకు అతని హృదయాన్ని వేధించినది తన ప్రేయసి! ఆమె మొదట్లో చక్రవర్తికి తనను తాను అర్పించుకొనినప్పటికి తర్వాత ఓ మంచి ధనవంతుడైన అధికారిని పెండ్లి చేసుకొని ఇప్పుడు తల్లి అయింది. అటువంటి ఆలోచనలు అతని హృదయములోకి వచ్చినపుడు

ఆ పరిస్థితుల నుండి దేవుడు తనను తప్పించినందుకు సంతోషించాడు. కాని తన జీవిత గమనం అనుకోకుండా మారిపోయింది అని బాధపడేవాడు. అటువంటప్పుడు ఏదైనా పనిలో పడిపోయి కష్టించడం అలవాటు చేసుకున్నాడు. ఎక్కువగా ప్రార్థించేవాడు. ప్రార్ధనలో అతను నెమ్మది పొందేవాడు. ఆవిధంగా రెండు మూడు రోజులు పెదవులతో ప్రార్ధన చేశాడు. అయినా తను ఏమయి ఉండాలో అది తన చేతిలో లేదు. దేవుని చేతిలో ఉందని తెలియదు. కాని ఈ ఆశ్రమ పెద్దలను దేవుడు నడిపిస్తాడు అని నమ్మి వారికి విధేయత కనపరచేవాడు.

అదేవిధంగా ఈ సన్యాసాశ్రమములో ఏడు సంవత్సరాలు గడిపి మూడు సంవత్సరముల తర్వాత అతనిని ఫాదర్ సర్గీస్ అనే పేరు పెట్టి అభిషేకము చేసారు. అతని తల్లి చనిపోయింది. అతని చెల్లెలు వివాహము చేసుకున్నది. ఇవన్నీ అతని మీద ఏ ప్రభావము చూపలేదు. ఇక ఈ ఆశ్రమములో తను నేర్చుకొనవలసినది ఏమిలేదని అనిపించింది. అతను చాలా నీరసపడిపోయాడు. తన అంతరంగ జీవితము దేవుని యెడల సరియైనదిగా ఉండేటట్లు చూసుకోవాలని నిర్ణయించుకున్నాడు.

ఫాదర్ సర్గీస్ (స్టీఫెన్)ను మెట్రోపాలిటన్ ఆశ్రమానికి పెద్దగా నియమించి పంపించారు. అతను వెళ్ళుటకు ఇష్టపడకపోయినా పెద్దలకు లోబడి ఉండాలని వెళ్ళాడు. అక్కడికి వెళ్ళిన తర్వాత అతను చాలా శోధనలు జయించవలసివచ్చినది. మొదటిది స్త్రీల విషయం. పూర్వం తను ఉండిన ఆశ్రమంలో స్త్రీలు లేరు. కాని ఇక్కడ స్త్రీలు తనను తరచుగా బహు ఘోరంగా శోధించారు. తనను ఇక్కడ నుండి బదిలీ చేయమని పై అధికారులకు వ్రాశాడు. ఇక అక్కడ ఒక స్త్రీ అతనిని బహుగా వేధించింది. కాని అతను ఎప్పుడు తన వెంబడి ఒక శిష్యుని ఉండనిచ్చేవాడు.

ఈ పెద్ద చర్చిలో అనేకమంది అనేకరకములైన స్త్రీలు తన ఎదురుగానే పోకిరి చేష్టలు చేసేవారు. తన చూపు ఎల్లప్పుడు వెలుగుతున్న దీపము మీదే ఉంచేవాడు. ఆ చర్చిలో పనిచేయడానికి లోక సంబంధియైన ఓ పూజారి నియమించబడ్డాడు. అతని ఎదుట పడకుండా తన పనిలో మునిగిపోయేవాడు.

ఒకరోజు సర్గీస్ ప్రధాన పూజా మందిరములో నుండి బయటకు వచ్చి అబ్బాట్ (క్రొత్త పూజారి) వైపు చూస్తే అబ్బాట్ ఎవరో మిలటరీ దుస్తులలో ఉన్న వ్యక్తితో మంతనాలు చేస్తున్నాడు. తలవంచుకొని తన గదిలోకి వెళ్ళాడు. కొంచెంసేపటికి ఆ మిలటరి అతను సర్గీస్ గదిలోకి వస్తూ "బాగున్నారా స్టీఫెన్? నన్ను గుర్తుపట్టారా? మనిద్దరం కలిసి ఒకేచోట పనిచేశామ"ని ఎగతాళిగా అన్నాడు.

వెంటనే సర్గీస్ అబ్బాట్ వైపు చూస్తూ "అయ్యా! నేను లోకములో నుండి వేరుపడి దేవుని సన్నిధిలో జీవిస్తుంటే నన్నెందుకు మీరు ఎండగడతారు?" అని వెళ్ళిపోయాడు.

మరునాడు అబ్బాట్ వద్దకు వెళ్ళి "నన్ను క్షమించండి, నేను దురుసుగా మాట్లాడాను" అని క్షమాపణ అడిగి తనను ఇక్కడికి పంపించిన సారెట్‌గారికి ఓ ఉత్తరం వ్రాశాడు. మరునాడు సారెట్ వద్దనుండి జవాబు వచ్చినది. సర్గీస్ యొక్క అహంకారము వలననే ఈ బాధ కలిగినదని సన్యాసులవలె అందరితో కలసిమెలసి ఉండక పోవడం దేవుని వలన కాదని అది అంతర్యములో నెలకొని ఉన్న గర్వమని ఈ లోక సంబంధ గర్వము అహము నిన్ను వదలనంతకాలం నువ్వు సంతోషంగా ఉండలేవు అని వ్రాశాడు.

టామ్ బో - సన్యాసాశ్రమములో హిల్లరి అనే పరిశుద్ధుడు చనిపోయాడు. ఇప్పుడు నీ ఉత్తరం వచ్చింది. అక్కడ ఉన్న గురువుకు ఉత్తరం వ్రాస్తున్నాను. నిన్ను గురించి అతను వినియున్నాడు. నువ్వు అక్కడికి వెళ్ళి దేవుని ధ్యానములో ఉండు - ప్రభువు నిన్ను నడిపిస్తాడు అని వ్రాశాడు సారెట్.

అక్కడ ఉన్న పూజారి (అబ్బాట్) వ్యాపారవేత్తల వంశము నుండి వచ్చినవాడు. సర్గీస్‌ను క్రమంగా ఆహ్వానించి చనిపోయిన హిల్లరి గదిని అతనికిచ్చాడు. సర్గీస్‌కు తోడుగా ఓ యువకుని తోడుయిచ్చాడు. కాని సర్గీస్ వారించాడు. హిల్లరి గది కొండ మొదల్లో తీర్చబడిన గుహ. కొండవైపుగా ఉన్న ద్వారము బయట హిల్లరిని పాతిపెట్టారు. ఎడమప్రక్కన ఉన్న గదిలో రోజుకు ఒక్కసారి భోజనము పెడతారు. ఒక అరుగు, ఒక తాటాకు చాప పరచబడి ఉంటాయి. సర్గీస్ ఇప్పుడు ఏకాంత సన్యాసి అయ్యాడు.

**(సశేషం)**

చిన్నపిల్లల పేజి




# నీతిపరుడైన న్యాయాధిపతి

ఒకానొకప్పుడు ఒక నీతిపరుడైన న్యాయాధిపతి ఉండేవాడు. అతడు ఎప్పుడు మంచి తీర్పు తీర్చే వాడు. తను బడ్డి అనే అద్భుతమైన అబ్బాయికి తండ్రి. ఆ న్యాయాధిపతి చాలా మంచి తండ్రి తన కొడుకును చాలా ప్రేమిస్తాడు. బడ్డి చాలా మంచి వాడు. తను తన తండ్రిని గౌరవిస్తాడు తనని ఎప్పుడు సంతోషపెట్టాలని చూస్తాడు. బడ్డికి తన స్నేహితులతో బేస్‌బాల్ ఆడడం ఇష్టం. ఒకరోజు తన స్నేహితులు బడ్డితో ఓల్డ్ విల్‌సన్ ఇంటి వెనకాల ఖాళి స్థలంలో ఒక మంచి ఆట జరుగుతుంది అని చెప్పారు. కాని బడ్డికి తెలుసు తను అక్కడ ఆడకూడదని ఎందుకంటే ఓల్డ్ విల్‌సన్ చాలా గొప్ప వాడు కాని పిసినారి ముసలాయన. ఆ ముసలాయనకి బడ్డి తండ్రి అంటే కోపం. ఎందుకంటే న్యాయాధిపతి తనని టిక్కెట్టుకు డబ్బు కట్టేలా చేసాడు. ఆ ముసలాయన కట్టాలని అనుకోలేదు ఎందుకంటే తను చాలా గొప్పవాడు కాబట్టి. ఓల్డ్ విల్‌సన్‌కి ఒక అద్దం కిటికి ఉంది అది చాలా విలువైనది ఎప్పటికి తియ్యలేనిది. అది అన్నిటిలో ఒక్కటి. అందుకని న్యాయాధిపతి బడ్డిని ఆ కాలి స్థలంలో ఆడొద్దు అని చెప్పాడు. ఎందుకంటే బడ్డి ఆ అద్దాన్ని పగలకొడతాడని. కాని బడ్డి ఎప్పుడు అంత దూరం బాల్‌ని కొట్టలేదు అలానే బడ్డి తండ్రి పనిలో ఉండటం వల్లా ఎప్పుడు తనని చూడలేదు ఆడేటపప్పుడు.

ఎప్పుడైతే బడ్డి ఆ ఆట జరిగే ప్రదేశానికి వచ్చాడో అప్పుడే ఆట ప్రారంభం అయ్యింది. అలానే తను చాలా ఆనందంగా ఉన్నాడు. ఎందుకంటే తన పుట్టినరోజున ఒక క్రొత్త బేస్‌బాల్ బ్యాట్ బహుమతిగా పొందాడు. అంతా బాగానే జరుగు తుంది. ఆట అయిపోవచ్చింది. తన టీమ్ గెలుస్తుంది. తను తన క్రొత్త బ్యాట్ పట్టుకొని ఆటగాడు బాల్ విసురుతుంటే చూస్తున్నాడు బాల్ సరైన గురికి వచ్చిందాకా ఆగాడు ఇప్పుడు బ్యాట్‌తో బాల్‌ని కొట్టాడు. ఆ బాల్ నేరుగా ఓల్డ్ విల్‌సన్ అద్దం కిటికీ వైపు వెళ్తుంటే చూసాడు. బడ్డి చాలా భయంగా చూస్తున్నాడు. తను ఆ అందమైన అద్దం పగలటం విన్నాడు. ఆ అద్దం ముక్కలన్ని క్రింద పడ్డాయి. ఆ అద్దం పగిలిన వెంటనే ఓల్డ్ విల్‌సన్ ఇంటినుండి బయటకి వచ్చాడు. బడ్డి స్నేహితులు అందరు పారిపాయారు. కాని బడ్డి అక్కడే ఆగి పోయాడు.

“నువ్వు న్యాయాధిపతి కుమారుడివి కదా,” అన్నాడు ఓల్డ్ విల్‌సన్. “ఇప్పుడు చూద్దాం తన కుమారుని ఎలా శిక్షిస్తాడో తన నేరానికి. ఆ అద్దం ఎన్నో మిలియన్ డాలర్లు అంత డబ్బు నీ దగ్గర లేదని అందరికి తెలుసు” అని బడ్డి మొహంవైపు తన వ్రేలు పెట్టి అన్నాడు.

ఓల్డ్ విల్‌సన్ చాలా సంతోషంగా ఉన్నాడు. ఎందుకంటే బడ్డిని వాళ్ళ తండ్రిని న్యాయస్థాన గదికి తీసుకొచ్చినందుకు. బడ్డికి చాలా సిగ్గు వేసింది తన తండ్రి కళ్లలోకి చూడాలంటే. అందరు తనని బాధగా అలానే ప్రేమగా చూస్తున్నారు. తనకు సిగ్గుగా ఉన్నప్పటికి సంతోషంగా కూడ ఉంది తన తండ్రే న్యాయాధిపతి కాబట్టి. తన తండ్రి తనని ఎప్పటికి జైల్‌కి

పంపడని. బడ్డికి తెలుసు తనకి ఈ శిక్ష తగిందేనని. కాని బడ్డి సంతోషం కొద్దిసేపే. ఎప్పుడైతే తన తండ్రి చెప్పింది విన్నాడో తన సంతోషం పోయింది. న్యాయాధిపతి బడ్డిని ఒక మిలియన్ డాలర్లు కట్టమన్నాడు లేకపోతే జైలుకి వెళ్ళమన్నాడు.

"కాని నాన్న నువ్వు నా తండ్రి. నువ్వు దీని నుంచి నన్ను తప్పించలేవా నేను నీ కుమారున్ని? నేను చేసిన తప్పుకు నన్ను క్షమించు. నాకు తెలుసు నాకు ఈ శిక్ష తగిందని, కాని నీకు తెలుసు నా దగ్గర అంత డబ్బు లేదని అలానే నేను జైలుకి వెళితే మనిద్దరం ఒక సంవత్సరమంతా దూరమవుతాం

"అలాగే ఉండని" అన్నాడు న్యాయాధిపతి. ఓల్డ్ విల్సన్ కూడా ఆశ్చర్యపోయాడు. అక్కడ ఉన్న ఆఫీసర్స్ బడ్డి దగ్గరికి సంకేళ్లు తీసుకొని వస్తున్నారు. ఇంతలోపు ఆ న్యాయాధిపతి "ఆగండి" అన్నాడు. అందరు న్యాయాధిపతినే చూస్తున్నారు అతను తన పై వస్త్రం తీసివేసి అది మడతపెట్టి కుర్చిపై పెట్టాడు. అతడు బడ్డి దగ్గరకు వచ్చి తన ప్రక్కన నుంచొని "నేను ఇప్పుడు న్యాయాధిపతిని కాదు. నీ తండ్రిని" అని అన్నాడు. "నేను నాకున్నది అంత అమ్మి నిన్ను జైలుకి నుంచి బయటికి తీసుకొని వస్తాను. అప్పుడు మనం దూరం కాలేముగా" అన్నాడు.

మనమందరము బడ్డి లాంటివారమే. మనమం దరము తప్పులు చేస్తువుంటాము. కాని పరలోకం సంపూర్ణమైనది. మనలను దేవుడు అక్కడికి పాపులుగానే అనుమతిస్తే అది ఎంత మాత్రము సంపూర్ణమైనదిగా ఉండదు. అది అపవిత్రం అయిపోతుంది. బైబిల్ ఏమి చెప్తుంది అంటే పాపమువలన వచ్చు జీతము మరణం. దేవుని నుండి దూరం అయి పోవుట. దేవుడు ఎంతో సంపూర్ణమైనవాడు కనుక మన నీతి క్రియలకు మనకు తీర్పు తీరుస్తాడు. ఓల్డ్ విల్సన్‌లాగా సైతాను తప్పులను అందరికి చూపుతాడు. మరి యేసు ఈ కథలోని తండ్రి లాండి వారు. ఆయన ఏ పాపము లేకుండా ఒక మనిషిలాగా జన్మించారు. మనం గనుక యేసుని బహుమానంగా స్వీకరించినట్లయితే అతను మన పాపము లకు జీతం చెల్లిస్తాడు.


**ఇంటర్‌నెట్‌లో తెలుగు బైబిలు కొరకు దర్శించండి :**

**www.onlinetelugubible.net**


## పాఠకులకు శుభవార్త

**'పరిశుద్ధత'** మాసపత్రిక ఇంటర్నెట్‌లో చదువుకొనే సౌకర్యము కల్పించామని తెలియజేయుటకు సంతోషిస్తున్నాము. వెబ్‌సైట్ పేరు **www.holinessmagazine.com.** ప్రస్తుతము మీరు 2014 సంచికలన్నీ డౌన్‌లోడ్ చేసు కొనవచ్చును. త్వరలో పాత సంచికలన్నీ ఇంటర్నెట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనే సౌకర్యం కల్పించటానికి ప్రయత్నిస్తాము. అంతేకాక శ్రీమతి మాధురి మరియన్‌గారు పాడిన **'పరిశుద్ధ గీతములు' (Holi Melodies)** ఎనిమిది సి.డి.ల పాటలు మరియు **క్రిస్మస్ పాటలు** వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. మీరు ఈ పాటలను వినవచ్చు, డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. త్వరలో **'పరిశుద్ధ ప్రవాహిని'** టి.వి. కార్యక్రమములో ప్రసారమయ్యే ప్రసంగాల వీడియోలను కూడా ఈ వెబ్‌సైట్ ద్వారా అందుబాటులోకి తేవాలన్న ఆలోచన ఉంది. ప్రార్థించండి. విదేశాలలో ఉన్న మీ బంధువులకు, స్నేహితులుకు తెలియజేయండి. దేవుడు మిమ్ములను దీవించును గాక!

**– ఎడిటర్**

# “ద డే ఆఫ్ రిడమ్షన్”

## (గుడ్‌ఫ్రైడే కాదు)

యేసు క్రీస్తు జనన మరణ పునరుత్థానములు అనాది నుండి వివాదాంశములుగానే వున్నాయి. ఎందుకంటే ఈ పండుగల ఆవతరణ యేసుక్రీస్తు మరణించి పునరుత్థానుడై పరమునకు ఎత్తబడిన తరువాత 300 సంవత్సరములకు గాని ఈ ఆచరణ జరుగలేదు. నీరో చక్రవర్తి కాలంలో క్రైస్తవులు బహిరంగంగా బోధలు చేసుకొనుటకు గాని ప్రార్ధనలు చేసుకొనుటకు గాని ఆవకాశం ఇవ్వబడలేదు. కాన్‌స్టాంట్ అనే రాజు ప్రభువును నమ్మిన తరువాత ఈ పండుగలను ప్రవేశ పెట్టాడు. అయితే అప్పటికి ఎవరు కూడా యేసుక్రీస్తు పుట్టుక మరణములు సరిగ్గా రికార్డు చేయకపోవడంవల్ల పేరుగాంచిన అన్యజనుల పండుగలనే ఈ చక్రవర్తి క్రైస్తవుల పండుగలుగా అనగా క్రిస్టమస్ ఈస్టర్ పండుగలుగా మార్చి అచరించమని ఆదేశించాడు దానినే క్రైస్తవులు ఇప్పటి వరకు ఆచరిస్తున్నారు. ఇందులో గుడ్‌ఫ్రైడే ఒకటి, ఇది యేసు క్రీస్తు మరణించిన రోజుగా ప్రకటించారు.

అయితే యేసుక్రీస్తు సిలువ వేయబడినది శుక్రవారం కానేకాదు, నేను యోనావలె మూడు రాత్రింబవళ్లు భూగర్భంలో ఉంటానని చెప్పారు (మత్త 12:40). ఆయన మాట తప్పదు. (లూకా 21:33). శుక్రవారం యేసుక్రీస్తు మరణించిన రోజుగా ప్రకటించడానికి ఒకే ఒక కారణం ఏమంటే యేసు ప్రభువు చనిపోయినది సిద్ధపరచు దినము విశ్రాంతి దినము ఆరంభము కావచ్చెనని వ్రాయబడినది. యూదులకు సాయంకాలముతో రోజు మొదలవుతుంది. మరుసటి రోజు సాయంత్రము వరకు ఒకరోజు. విశ్రాంతి దినమునకు ముందు రోజు సిద్దపరచు దినము అని పేరు. ఎందుకంటే విశ్రాంతి దినమున యూదులు ఏ పని చేయరు. అందువలన విశ్రాంతి దినమునకు ముందు రోజునే విశ్రాంతి దినమునకు కావలసినవన్ని సిద్దపరు స్తారు. అందువలన దానికి సిద్దపరచు దినము అని పేరు. యూదులకు శనివారం సబ్బాతు దినము (విశ్రాంతి దినం) కనుక ప్రతి శుక్రవారం సిద్దపరచు దినము. (లూకా 23:54) “ఆ దినము సిద్దపరచు దినము విశ్రాంతి దినారం భము కావచ్చునని” వ్రాయబడివున్నందున్న యూదుల విశ్రాంతి దినము శనివారమే కదా. సిద్దపరచు శుక్రవారము కాదా. సిద్దపరచు దినము యేసు క్రీస్తు చనిపోయినాడు. అనగా శుక్రవారం యేసు క్రీస్తు చనిపోయాడని ప్రకటన చేసి దానికి గుడ్‌ఫ్రైడే అని నామకరణం చేసి పండుగ ఆచరించడం మొదలు పెట్టారు. అయితే ఇక్కడ ఒక పెద్ద పొరపాటు జరిగి పోయింది. యేసు ప్రభువు అందరి యెదుట (మత్త 12:40) “యోనా తిమింగలం కడుపులో మూడు రాత్రింబగళ్లు ఎలాగ ఉండెనో ఆలాగుననే మనుష్య కుమారుడు మూడు రాత్రింబగళ్ళు భూగర్భంలో ఉండును అని చెప్పారు. ఆకాశము భూమి గతించునుగాని యేసు మాటలు గతించవు (లూకా 21:33) కనుక యేసు మూడురాత్రుళ్లు మూడు పగళ్లు భూగర్భంలో వుండి నాలుగవ దినం అనగా ఆదివారము మొదలవగానే సమాధిని మరణాన్నీ జయించి లేచాడు. అందరు అనుకు న్నట్టుగా ఆదివారము ఉదయాన యేసుప్రభువు లేవలేదు. శనివారము సాయంత్రంతో ఆదివారము మొదలవుతుంది కనుక ఆ సాయంత్రమే లేచాడు. అయితే కనపడినది మాత్రం ఆదివారము ఉదయాన స్త్రీలు మసక చీకటిలో సమాధి దగ్గరకు వెళ్లినప్పుడు ఖాళీ సమాధినే చూశారు. ఆయన అప్పటికే లేచి గలిలయకి వెళ్లినాడని దూతలు చెప్పారు. దూత వచ్చి రాతిని పొర్లించినప్పుడు సమాధిలో యేసు లేడు.

యేసు మూడురాత్రుళ్లు మూడు పగళ్లు సమాధిలో ఉన్నాడని అనటానికి ఋజువులు చూద్దాం. (1) మొదటి దినము విశ్రాంతి దినము (లేవి 23:24). యేసు పునరుత్థానుడైన రోజున ఎమ్మాయి మార్గంలో ఇద్దరు శిష్యులను కలిసినప్పుడు వారు యేసుక్రీస్తు శిలువ వేయబడిన సంగతులు మాట్లాడుతూ “ఈ సంగతులు జరిగి నేటికి మూడు దినములాయెను” అని సాక్ష్యమిచ్చారు. (2) పదియవ దినము విశ్రాంతి దినము (లేవి 23:32). ప్రధాన యాజకులును పరిసయ్యులును యేసును శిలువ వేసిన తరువాత పిలాతు దగ్గరకు వచ్చి.. (3) (లేవి 23:37) లో “యెహోవా నియమించిన విశ్రాంతి దినములు కాక” అని వ్రాయబడియున్నది **విశ్రాంతి దినములు**. అయ్యా ఆవంచకుడు సజీవుడై వుండినప్పుడు మూడు దినములు అయిన తరువాత నేను లేచెదనని చెప్పినది మాకు జ్ఞాపకమున్నది. (మత్తయి 27:63) కనుక సమాధిని భద్రముచేయుటకు సెలవు ఇమ్మని పిలాతు దగ్గర ఆజ్ఞలు పొందారు. వీటన్నిటిని మించి యేసుప్రభువే యోనా మూడు రాత్రింబగళ్లు చేప కడుపులో ఎలాగు ఉందునో అలాగు మనుష్యకుమారుడు మూడు రాత్రింబగళ్లు

భూగర్భంలో ఉండును అని పలికాడు (మత్తయి 12:40). కనుక యేసు ప్రభువు మూడు రాత్రుళ్లు మూడు పగళ్లు భూగర్భంలో ఉన్నాడు అనునది సత్యం. అయితే శుక్రవారం అని ఎందుకు ఆచరిస్తూ వస్తున్నారు? యేసుప్రభువు చనిపోయింది శుక్రవారం కాదని చాలామందికి తెలుసు అయినా ధైర్యంచేసి ఎవరు ఈ సత్యాన్ని ప్రకటించడానికి ముందుకు రాలేదు. సరే ఇప్పుడు కారణాలు గమనిద్దాం, పైన చెప్పిన విధంగా (1) మొదటి దినము విశ్రాంతి దినము (లేవి 23:24) ఆ దినము సిద్ధపరచు దినము విశ్రాంతి దిన ఆరంభం కావచ్చెను. (2) 10యవ దినము విశ్రాంతి దినము (లేవి 23:32). (లూకా 23:54) ఆజ్ఞ చొప్పున విశ్రాంతి దినాలు తీరికగా ఉండిరి. ఆ దినము సిద్ధపరచు దినము విశ్రాంతి దినము మరుసటి విశ్రాంతి దినము మహాదినము (యోహాను 19:31). ఇక్కడే మనుష్యులు పొరపాటుగా అర్థంచేసుకున్నారు. ఇశ్రాయేలీయులకు ఏడవ దినము వచ్చే విశ్రాంతి దినం కాక ఇంకా విశ్రాంతి, పరిశుద్ధ దినములున్నవి. అన్ని విశ్రాంతి దినాలకు ముందువచ్చే రోజుని సిద్ధపరచు దినము అని అంటారు.

మహా విశ్రాంతి దినము కూడా వున్నది లేవీయ కాండము 23వ అధ్యాయంలో విశ్రాంతి దినాలు గురించి వ్రాయబడినది. 26 నుంచి 32 వరకు చదివితే మహా విశ్రాంతి దినము సంగతి తెలుస్తుంది. ఇప్పుడు యేసు ప్రభువు చనిపోయినది ఈ మహా విశ్రాంతి దినమునకు ముందు రోజునే ఈ మహా విశ్రాంతి దినము యూదులు నిస్సాన్ మాసములో చేసుకొనే పొంగని రొట్టెల పండుగలో మొదటిరోజు ఈ 7 రోజులు మహా విశ్రాంతి దినము నిస్సాన్ మాసము 15వ రోజు వస్తుంది. అది ఏ రోజైనా కాని పదిహేనవరోజు వస్తుంది అందుకే యోహాను భక్తుడు 19:31లో ఆ విశ్రాంతి దినమును మహా విశ్రాంతి దినము అని వ్రాశారు. అంటే మామూలుగా వచ్చే విశ్రాంతి దినము కాదని అర్థము. (మత్తయి 27:63) మరునాడు అనగా సిద్ధపరచు దినమునకు మరుసటి దినమును అని వ్రాశాడు కానీ విశ్రాంతి దినము అని వ్రాయలేదు కనుక అది మామూలుగా వచ్చే శనివారము విశ్రాంతి దినము కాదని అర్థము (లూకా 23:56)వ వచనంలో ఆజ్ఞ చొప్పున విశ్రాంతి దినమున తీరికగా ఉండిరి శనివారం వచ్చే విశ్రాంతి దినము అయితే వారు దేవాలయంలోకి వెళ్లి ప్రార్థనలో వుంటారు. వేరే విశ్రాంతి దినములైతే దేవాలయ మునకు ఖచ్చితంగా పోవలసిన అవసరత లేదు. ఏ పని చేయకూడదు అనేదే ముఖ్య కట్టబాటు కనుక దీనిని బట్టికూడా ఇది మాములుగా వచ్చే విశ్రాంతి దినము కాదని ఋజువు అవుతుంది. కనుక వీటన్నిటిని బట్టి తేలిన సత్యం ఏమిటంటే అప్పటి మహా విశ్రాంతి దినము గురువారము నాడు వచ్చినది దానికి ముందురోజు బుధవారము సిద్ధపరచు దినము బుధవారము సాయంత్రం యేసు చనిపోయాడు. అసలు చనిపోయినది లెక్క కాదు ఎన్ని రోజులు భూగర్భములో ఉండినది లెక్కలోనికి తీసికోవాలి. బుధవారము సాయంత్రం మహా విశ్రాంతి దిన ఆరంభము బుధవారం సాయంత్రము యేసుని సమాధిలో వుంచారు.

**1) బుధవారము రాత్రి, గురువారము పగలు ఒకరోజు. 2) గురువారము రాత్రి, శుక్రవారము పగలు రెండవరోజు. 3) శుక్రవారము రాత్రి, శనివారము పగలు మూడవరోజు.** శనివారము సాయంత్రంతోనే ఆదివారము మొదలవుతుంది కాబట్టి మూడు రాత్రింపగళ్లు అయిన తరువాత యేసు తన మాట ప్రకారం సమాధిలో ఉండడు అంటే శనివారము రాత్రే లేచాడన్నమాట అయితే ఇక్కడ ఒక ప్రశ్న వేస్తారు. శనివారం రాత్రి లేస్తే ఆ రాత్రంతా ఎక్కడున్నాడు శిష్యులకు ఎందుకు కనబడలేదు. ఆయన వెదికే వారికే కనబడతాడు ఉదయాన్నే వెదికారు కనబడ్డాడు. ఇంకో జవాబు ఏమిటంటే దూతలు చెప్పిన విధముగా ఆయన ముందుగా గలిలయకు వెళ్లాడు.

కనుక ప్రియులైన క్రైస్తవ మిత్రులందరిని నేను ప్రార్థనా పూర్వకంగా వేడుకొనేది ఏమిటంటే మాట తప్పని యేసుని అబద్ధకునిగా చేయకండి ఆకాశము భూమి గతించునుగాని ఆయన మాటలు గతించవు. గుడ్‌ఫ్రైడే అనే మాటను తీసివేద్దాం. గుడ్‌వెన్స్‌డే అందామా అది కూడా తప్పే గుడ్ ఫ్రైడే, గుడ్ వెన్స్‌డే అనే దాంట్లో అర్థం లేదు. అయితే ఆ రోజుని అనగా యేసు సిలువ వేయబడిన రోజు ఆ బుధవారమును

**"ద డే ఆఫ్ రిడమ్షన్"**

"ద డే ఆఫ్ రిడమ్షన్" గా నామకరణ చేద్దాం ఎందుకంటే ఆ రోజునే పాపముల నుండి మనము విడుదల పొందిన దినము. కనుక విజ్ఞులయిన క్రైస్తవ ప్రియులందరు దీనిని ఆలోచించి క్రీస్తు అబద్ధికుడు కాదు. మూడు రాత్రులు మూడు పగళ్లు ఆయన చెప్పిన విధంగా భూగర్భంలో ఉన్నడని ఋజువుచేద్దాం. కనుక పునరుత్థాన దినమునకు ముందు వచ్చే బుధవారమును "ద డే ఆఫ్ రిడమ్షన్" గా ఆచరిద్దాం. **గుడ్‌బై టు గుడ్‌ఫ్రైడే**

# సాక్ష్యము

మాది పశ్చిమ గోదావరి జిల్లా, కోవూరు గ్రామము. మేము కమ్మవారము. మా తండ్రి ఉండవల్లి సత్య నారాయణ, తల్లి ఝాన్సీ. మాది హిందూ కుటుంబము. నాకు ఒక అక్క, ఇద్దరు తమ్ముళ్ళు వున్నారు. నేను బి.యస్సీ వరకు చదివాను. మా బంధువులలో కొందరు యేసు ప్రభువును నమ్ముకున్నారు. వారి ద్వారా చిన్నతనములోనే యేసుప్రభువు మహిమ గురించి విన్నాను.

1985 అక్టోబరులో పశ్చిమ గోదావరి జిల్లా, కొమ్ముగూడెం వాస్తవ్యులు శ్రీ వట్టికూటి రామారావు, బుల్లెమ్మాయిగారి రెండవ కుమారుడు లక్ష్మణరావుగారితో వివాహము జరిగినది. వివాహమైన రెండు నెలలకు పై చదువు నిమిత్తం జపాను దేశమునకు వెళ్ళారు. తర్వాత ఒక నెలకు నేను కూడా జపాను దేశం వెళ్ళాను. ఒకటి న్నర సంవత్సరం తర్వాత పాలిమర్ డాక్టరేట్ తీసుకొని మావూరు వచ్చాము. 1987 ఆగష్టు నెలలో మాకు ఒక కుమార్తె జన్మించింది. మా వారికి 1987లో త్రివేంద్రంలో ఇస్రోలో సైంటిస్ట్‌గా ఉద్యోగం వచ్చింది. అందువల్ల 1988 ఫిబ్రవరిలో త్రివేంద్రంలో కాపురం పెట్టాము.

మేము జపాన్‌లో వున్నప్పుడు చాలామంది జపాను వారితో స్నేహం ఏర్పడింది. నా స్నేహితురాలు ఒకామె వెడ్డింగ్ డ్రస్ బ్రైడల్ మేకప్ సంస్థలో పనిచేసేది. ఆమె ఒకసారి క్రిస్మస్ పండుగ రోజున నన్ను క్రైస్తవ పెండ్లి కుమార్తెవలె తెల్లని గౌను వేసి తలకి వెయిల్ వేసి, పెండ్లి కుమార్తెవలె అలంకరించారు. మా వారికి పెండ్లి కుమారునిగా డ్రస్ వేశారు. మమ్మల్ని ఉంగరాలు మార్చుకోమని చెప్పి ఫోటోలు తీశారు. అప్పటికి మేము ఇంకా రక్షణలోనికి రాలేదు. ఇదంతా మేము రక్షణలోకివచ్చి యేసు ప్రభువును మా స్వరక్షకునిగా అంగీకరించి బాప్తిస్మము తీసికొనటానికి ప్రభువు ప్రణాళిక అని మాకు తెలియదు. యేసుప్రభువును గురించి కూడా మాకు తెలిసింది స్వల్పమే.

తర్వాత మూడు సంవత్సరాలకు మాకు బాబు జన్మించాడు. త్రివేంద్రంలోనే ఒక స్థలము కొని ఇల్లు కట్టుకోవటం ప్రారంభించాము. మా వారు సైంటిస్ట్ అయినందున ఇల్లు కట్టించేటప్పుడు పనివారు పెట్టే ఇబ్బందులకు చాలా విసికి పోయారు. గోడల వరకు కట్టిన ఇల్లు ఆగిపోయింది. మేము చాలా బాధపడిపోయాము. భాష తెలియని ఊరు. సహాయం చేసే స్వంతవారు చాలా దూరంలో వున్నారు. ఎవరు సహాయం చేస్తారు? ఎవరు సహాయం చేసినా కొంత వరకే కదా!

అప్పుడు యేసుప్రభువు జ్ఞప్తికి వచ్చాడు. ఆయనను గురించి నాకు కొంచెమే తెలిసినా, ఆయన జీవముగల దేవుడు సహాయపడే దేవుడు అని ఆయనకు ప్రార్థించటం ప్రారం భించాను. అసలు నాకు ప్రార్థన చెయ్యటం కూడా సరిగా రాదు. అయినా నా హృదయంతో ప్రార్థించటం ప్రారంభిం చాను. ఇక్కడ సముద్రపు ఒడ్డున 'వెట్టికడ' చర్చి ఉంది. అక్కడకి వెళ్ళటం ప్రారంభించాము. ప్రభువు సహాయం చేశాడు. 1994 అక్టోబరు నాటికి ఇల్లు పూర్తయింది. ఆ సమయంలో ఒక మంచి క్రైస్తవ కుటుంబమును మా యింటి వెనకాల కాపురం వుండుటకు దేవుడు పంపించాడు. వారు మళయాళీలు అయినా చక్కగా తెలుగు మాట్లాడతారు. వారు హైదరాబాద్‌లో రైల్వే ఇంజనీరుగా పనిచేసి రిటైరై ఇక్కడ నివశించటానికి వచ్చారు.

ఇక్కడ పాస్టరు సురేష్ బెరియన్ ఇంగ్లీషు సర్వీసు ప్రారంభించారు. మేము ఆ సర్వీసుకు క్రమంగా హాజరయ్యే వారము. ఆ చర్చి పేరు పిలిగ్రిమ్స్ హైలాండు చర్చి. అందు వలన యేసుప్రభువును గురించి ఇంకా ఎక్కువ తెలుసుకో గలిగాము. ఈ విధంగా పదమూడు సంవత్సరాల నుండి మా జీవితము ఆశీర్వాదకరంగా ముందుకు సాగు చున్నది. మా పిల్లలకు చిన్నతనం నుండి వారి హృదయములలో దేవుని వాక్యము నాటబడినది. తర్వాత నేను, నా భర్త

**...మిగతా 23వ పేజిలో**

# ఆత్మలు - క్రియలు

**పరిశుద్ధాత్మ ఒక వ్యక్తా లేక ఒక శక్తా?** Is He a man ? or Is it a Power

అపో.కార్య 2:3-4 వచనంలో వ్రాయిబడిన పదము ఒక్కొక్కని మీద వ్రాలగా, అని వున్నది - దీనిని బట్టియు, వాక్‌శక్తి అనుగ్రహించిన కొలది అని వ్రాయిబడిన దానిని బట్టియు అనేకులు పరిశుద్ధాత్మను ఒక శక్తి అని భావింతురు - కాని పరిశుద్దాత్ముడు ఒక వ్యక్తి, శక్తి ఎంత మాత్రము కాదు.

యోహాను 15:17, యోహ 16:13-14 వచనములందు ఇలా వ్రాయబడింది.

15:17 లోకము ఆయనను చూడదు. ఆయనను ఎరుగదు, ఆయనను పొందనేరదు.

మీరు (అనగా దేవుని బిడ్డలు) ఆయనను ఎరుగుదురు. ఆయన మీతో కూడ నివసించును.

16:13 అయితే ఆయన, ఆయన తనంతటతానే, ఆయన నావాటిలోని తీసికొని

పై వాక్యములో చెప్పబడిన “ఆయన” అను పదము. వ్యాకరణ పూర్వకముగ పురుష లింగమైన ఒక వ్యక్తిని గూర్చి చెప్పబడినట్టుగా వున్నది. అందుచేత పరిశుద్ధాత్మ దేవుడు ఒక వ్యక్తి గాని శక్తి గాని అనడానికి వీలులేదు. పరిశుద్ధాత్మ వ్యక్తి శక్తికాదు. వ్యక్తి అయితే మనకు కనబడాలి కదా అని వాదించేవారుంటారు. అట్టివారికి యేసు ప్రభువు వారు చెప్పేదే స్పష్టమైన సమాధానము యోహా 15:17 లోకము ఆయనను చూడదు. గనుక ఆయనను ఎరుగదు. ఆయనను పొందరు.

3. పరిశుద్ధాత్మ దేవుని దైవత్వమును గూర్చి:-

a. హెబ్రి 9:14 ఆయన నిత్యుడగు ఆత్మ - ఈయన ఎల్లప్పుడు నిలిచివుండేవాడు. వచ్చివెళ్ళేవాడు కాదు - నేను తండ్రిని వేడుకొందును. మీయొద్ద ఎల్లప్పుడు వుండుటకు ఆయన వేరొక ఆదరణకర్తను మీకనుగ్రహించును - యోహా. 14:16. దీనిని బట్టి నిత్యుడగు ఈ ఆత్మ ఎల్లప్పుడు విశ్వాసితో నిలిచివుండేది. ఒక వ్యక్తి తన పరిశుద్ధతను కాపాడు కుంటూ దేవునిలో నిలిచియున్నంత కాలము, పరిశుద్ధాత్మ వానితో నిలిచి వుంటుంది. పరిశుద్ధతను పాడుచేసు కున్నప్పుడు, పరిశుద్ధాత్ముడు దూరమవుతాడు అను విషయము విశ్వాసి గుర్తించాలి.

b) కీర్త.139:7-10 వచనములు “నీ ఆత్మ నుండి నేనెక్కడికి పోదును. ఆకాశమునకు ఎక్కిన నీవు అక్కడను ఉన్నావు. పాతాళమందు పండుకొనిన నీవు అక్కడను ఉన్నావు. సముద్ర దిగంతములలో నివసించిన నీ కుడి చేయి నన్ను పట్టుకొనును”

పై వాక్యములలోని పరిశుద్ధాత్ముడు సర్వాంతర్యామి అనియు, సర్వకాలములలో అన్ని స్థలములలో నిలిచివుండే వాడని తెలియపర్చుచున్నది.

యోనా 2:1-9 దేవుని సేవకుడైన యోనా మత్స్యము యొక్క కడుపులో నుండి సముద్రము యొక్క అడుగు భాగములో, సముద్రపు నాచు మధ్యలో నుండి దేవునికి మొర్రపెట్టగా, ఆ ప్రార్ధనను విని, అంగీకరించి, వెలుపలకు రప్పించినది ఈ పరిశుద్ధాత్మ దేవుడే. కాబట్టి ఈయన సర్వాంతర్యామి సర్వశక్తి సంపూర్ణుడు, అన్ని స్థలములలో అన్ని వేళల్లో నిలిచివుండేవాడు.

c) 1కొరిం.2:10-11 ఆత్మ అన్నింటిని, దేవుని మర్మములను కూడ పరిశోధించుచున్నాడు. పరిశుద్ధాత్మ దేవుడు సర్వము ఎరిగినవాడు అనగా వర్తమాన, భూత, భవిష్యత్ కాలముల జ్ఞానము, విషయములు పూర్తిగ ఎరిగినవాడని చెప్పవచ్చును. పరిశుద్ధ గ్రంథము మనము ఎరిగియున్న ఈ బైబిల్ గ్రంథమంతయు పరిశుద్ధాత్మ దేవుని ప్రేరణ వలననే సమకూర్చబడింది అని పేతురు భక్తుడు 2పేతు.1:21వ వచనంలో వ్రాస్తున్నాడు. 2 తిమోతి 3:16 “దైవవేశము వలన కలిగిన ప్రతి లేఖనము” అని వ్రాయ బడింది.

ఒక మనుష్యునికి తోటి మనిషి సంగతులే సంపూర్ణముగ తెలియవు. లేఖనములను వ్రాసిన వ్యక్తులలో రాజులు

మొదలు పశువుల కాపరులు, చేపలు పట్టువారు మొదలగు అనేక మంది కలరు. వీరందరు దేవుని గూర్చిన విషయము లను ఒక అక్షరము కూడ తొలగించుటకుగాని, కలుపుటకు గాని వీలులేనంత ఖచ్చితముగా వ్రాసినారంటే యిది కేవలము పరిశుద్ధాత్మ దేవుని కార్యమనే చెప్పాలి. అంతేగాక పరి శుద్ధాత్ముడు దేవునిలో ఒక భాగము గనుక దేవుని విషయము లన్నియు సంపూర్ణముగ తెలిసినవాడై యున్నాడు.

4. **పరిశుద్ధాత్ముడు త్రిత్వములో ఒకడు:-**

యేసుప్రభువు వారు గలలియలోని కొండపై శిష్యులకు చేసిన ఉపదేశము. మత్త 28:19 కాబట్టి మీరు వెళ్ళి, సమస్త జనులకు శిష్యులనుగా చేయుడి. తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములో వారికి బాప్తిస్మమిచ్చుచు. నేను ఏ ఏ సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నింటిని గైకొనవలెనని వారికి బోధించుడి.

2కొరిం. 13:14 ప్రభువైన యేసుక్రీస్తు కృపయు, దేవుని ప్రేమయు పరిశుద్ధాత్మ సహవాసమును మీకందరికి తోడై యుండునుగాక.

పై రెండు వాక్యభాగములందు పరిశుద్ధాత్మ దేవుడు త్రిత్వములో ఒక భాగమైయున్నట్టుగా మనకు తెలియుచున్నది.

**5. పరిశుద్ధాత్మ చేయు పనులు:-**

యోహా. 16:8 పాపమును గూర్చి, నీతిని గూర్చి తీర్పును గూర్చి లోకమును ఒప్పింప చేయును:-

యిందు ప్రధానమైన 3 భాగములు గలవు 1) పాపము 2) నీతి 3) తీర్పు

a) పాపియైన మానవునికి రక్షణ కల్పించే దానికి ప్రభువు ఈ లోకానికి వచ్చారు. అయితే మనిషి దేవునిని విశ్వసించ లేదు. ఆయనను అంగీకరించలేదు, ఆయనను ఘనపరచ లేదు, ఆయన యిచ్చే రక్షణ మనిషికి కనబడలేదు. ఒక వ్యక్తి క్రీస్తును తన స్వంత రక్షకునిగా అంగీకరించకపోవుటయే పాపము.

విశ్వాసమూలము కానిదేదో అది అంతయు పాపమే. అందుకే రోమా 5:1లో పౌలుగారు ఇలా చెప్పారు "కాబట్టి విశ్వాస మూలమున మనము నీతిమంతులుగా తీర్చబడి".

b) నీతిని గూర్చిన తప్పు: క్రీస్తు శరీరధారిగ లోకానికి రాక పూర్వమే లోకములో ఒక నీతి ఉన్నది. ఆ నీతిని దుర్నీతి లేక లోక నీతి అంటాము. అయితే క్రీస్తు తప్పక తరువాత పాపములో, లోకనీతిలోను బ్రతికే వారికి, పరిశుద్ధమైన నీతిలో బ్రతికేదానికి ఒక మార్గము చూపినారు. యిందు మానవుడు నీతిమంతునిగా మార్చడానికి ప్రభువు చేసిన ఏర్పాటును చూస్తాము. ఇది 4 మార్గాలు.

1. రోమా 3:24 "కాబట్టి నమ్మువారందరు ఆయన కృప చేతనే క్రీస్తు యేసునందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతిమంతులుగా తీర్చబడుచున్నాము".

ఇక్కడ దేవుని ఉచితమైన కృప ద్వారా విమోచన అనగా పాపవిమోచన తద్వారా నీతిమంతులుగా తీర్చబడుట.

2. రోమా 5:9 "ఆయన రక్తమువలన ఇప్పుడు నీతిమం తులుగా తీర్చబడి ఆయనద్వారా ఉగ్రతనుండి తప్పించబడు చున్నాము.

క్రీస్తు రక్తము మన పాపములను కడిగి పవిత్రపర్చుట ద్వారా మనము నీతిమంతులుగా మార్చబడుతున్నాము.

3. 1కొరి 6:11 క్రీస్తు నామమున మన దేవుని ఆత్మ యందు మీరు కడుగబడి, పరిశుద్ధ పర్చబడినవారై నీతిమం తులుగా తీర్చబడితిరి. ఇక్కడ పరిశుద్ధాత్మ దేవుడు మనలను పరిశుద్ధ పర్చుట ద్వారా నీతిమంతులముగా మార్చబడతు న్నట్లు చూడగలము.

4. రోమా 8:33 నీతిమంతులనుగా తీర్చువాడు దేవుడే. ఒక వ్యక్తిని నీతిమంతునిగా చేయగల్గినవాడు దేవుడే. మానవులు ఫలాన వ్యక్తి నీతిమంతుడు అన్నంత మాత్రాన అతడు దేవుని ఎదుట కూడ నీతిమంతుడు కానేరడు. దేవుడు ఎవరిని నీతిమంతులుగా ఎంచునో వారే నీతిమంతులు. పరలోక వారసులు.

" మరియు ఎవరిని ముందుగా నిర్ణయించెనో వారిని పిలిచెను. ఎవరిని పిలిచెనో వారిని నీతిమంతులుగా తీర్చెను, ఎవరిని నీతిమంతులుగా తీర్చెనో వారిని మహిమపరచెను".

యోహా. 16:13 సర్వసత్యములోనికి నడిపించును. క్రీస్తు రాకముందు లేక పరిశుద్ధాత్మ దేవుడు ఒక వ్యక్తిలో పని చేయకముందు ఆ వ్యక్తినందు సత్యముండదా? అనే ప్రశ్న రావచ్చును. ఔను సత్యము వుంది అబద్ధము వుంది. ఇవి రెండును పరిపూర్ణమైనవిగావు. సత్యము అసంపూర్ణము.

1 యోహా 1:16 "లోకములో ఉన్నదంతయు అనగా శరీరాశ,

నేత్రాశ, జీవపుడంబమును తండ్రివలన పుట్టినవికావు. అవి లోకసంబంధమైనవే.

కాబట్టి లోకములో వున్నదంతయు లోకసంబంధమైనది కలుషితమైనది. యోహ 14:6 నేనే మార్గము, సత్యము, జీవము. క్రీస్తు నిజమైన సత్యము. అసంపూర్ణతను సంపూర్ణము చేయగల్గినవాడు. పరిశుద్ధాత్ముడు ఒకని లోనికి వచ్చునప్పుడు, లోకములోని అసంపూర్ణ సత్యము(అబద్ధము) నుండి తప్పించి సర్వ సత్యమునకు నడిపిస్తాడు.

యోహాను 16:14 "ఆయన నావాటిలోనివి తీసికొని మీకు తెలియజేయును గనుక నన్ను మహిమ పర్చును".

బైబిల్ గ్రంథమంతయు పరిశుద్ధాత్మ చేత బోధింప బడినవి అని మొదటిగా గుర్తించాలి.

2 పేతురు 1:20-21 లో ఇలా వ్రాయబడింది "ఒకడు తన ఊహనుబట్టి చెప్పుటవలన లేఖనములలో ఏ ప్రవచనము పుట్టదని మొదట గ్రహించవలెను. ఏలయనగా ప్రవచనము ఎప్పుడును మనుష్యుని యిచ్ఛను బట్టి కలుగలేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపబడినవారై, దేవుని మూలమున పలికిరి".

దీనిని బట్టి పరిశుద్ధాత్ముడు క్రీస్తును గూర్చి బోధించుట ద్వారా మాత్రమే ఈ బైబిల్ గ్రంథము మనకు అందించ బడింది. అపొ.కార్య 2:4 "అందరు పరిశుద్ధాత్మతో నిండిన వారై ఆ ఆత్మ వారికి వాక్‌శక్తి అనుగ్రహించిన కొలది అన్య భాషలలో మాటలాడిరి".

యెరూషలేము పట్టణములోని ఒక మేడ గదిలో తన శిష్యులతో కలిసి యేసు చివరిగా పస్కా ఆచరించిన స్థల ములో శిష్యులతోపాటు మరికొందరు గలిలయులు అందరు యించుమించు 120 మంది ఆ గదిలో చేరి ప్రార్థన చేసుకొను చుండగా ప్రభువు చేత వాగ్దానము చేయబడిన ఆత్మనువారు పొందుకొని వాక్‌శక్తి వారికి అనుగ్రహింపబడినగొలది అన్యభాషలలో మాటలాడసాగిరి. అపొ.కార్య 2:14-42వ వచనము వరకు అపొస్తలుడైన పేతురుగారు క్రీస్తును గూర్చి యిచ్చిన సాక్ష్యము, ప్రజల మధ్యలో "ఈ యేసును దేవుడు లేపెను దీనికి మేము సాక్షులము" అని దృఢముగా సాక్ష్య మిచ్చి ప్రభువును మహిమపర్చిన విధానము అంతయు కేవలము పేతురు గారి శక్తి కాదుగాని అది పరిశుద్ధాత్మ దేవుని నడిపింపుగా గుర్తించాలి. యోహ 16:13 "సంభవింప బోవు సంగతులను మీకు తెలియ జేయును"

ఇది ప్రవచన వరముగా గుర్తించాలి. పరిశుద్ధాత్ముడు కాలమునకు అతీతుడు. 3 కాలములను ఒక్కసారిగా చూడగల్గినవాడు.

పాతనిబంధన కాలమునుండి భక్తులు ఎందరో క్రీస్తు పుట్టుకను గూర్చి, యుగాంతమును గూర్చి కొన్ని వేల సంవత్సరములకు ముందే తెలియపర్చిరి.

**క్రీస్తును గూర్చిన ప్రవచనము:-**

క్రీ.పూ 745 సం॥లో క్రీస్తు పుట్టుకను గూర్చి యెషయిగారి ప్రవచనము. యెష 9:6 ఏలయనగా మనకు శిశువు పుట్టెను, మనకు కుమారుడు అనుగ్రహింపబడెను. సమాధానకర్తయగు అధిపతి అని ఆయనకు పేరు పెట్టబడును.

క్రీ.పూ 687లో అనగా క్రీస్తు పుట్టుకకు రమారమి 700 సం॥ ముందుగానే ప్రవక్త మీకా గారు క్రీస్తు పుట్టుకను గూర్చి, ఆయన పుట్టబోయే స్థలము గూర్చి శాశ్వితమైన ఆయన రాజ్యమును గూర్చి ప్రవచించినారు.

మీకా 5:2 బెత్లెహేము ఎఫ్రాతా యూదావారి కుటుంబ ములలో నీవు స్వల్ప గ్రామమైనను నా కొరకు ఇశ్రాయేలీ యులను ఏలబోవువాడు నీలో నుండి వచ్చును. పురాతన కాలము మొదలుకొని శాశ్విత కాలమువరకు ఆయన ప్రత్యక్షమగుచుండెను".

యెషయా 7:14 "కన్యక గర్భవతియై కుమారుని కనును అతనికి ఇమ్మానుయేలు అని పేరు పెట్టును".

**యుగాంతమును గూర్చిన ప్రవచనము:-**

యెషయా 13:6-13 వరకు, యెష 34:2-4 వరకు, యెషయా 51:6. దానియేలు గ్రంథములోని ప్రవచనాలు, దర్శనాలు, యోవేలు గ్రంథములోని ప్రవచనాలు యివి అన్నియు పరిశుద్ధాత్ముని ద్వారానే బయల్పర్చబడినవి.

**6. పరిశుద్ధాత్మ దేవుడు మనతో కూడ వుంటాడు:-**

యోహ 14:17-18 వచనములు "ఆయన మీలో కూడ నివసించును. మీలో ఉండును. మీ యొద్దకు వచ్చును".

పరిశుద్ధాత్ముడు ఎప్పుడు నిలిచివుండేవాడు. కేవలము చర్చిలోనికి వెళ్లినప్పుడు ఆరాధన చేయునప్పుడు మాత్రమే గాక, ఇంట, బయట, సర్వకాల, మనతో మనలో వుండే

వాడుగా వున్నాడు. అయితే దీనికి ఒక నిబంధనకలదు. అది ఏమనగా పరిశుద్ధాత్మ దేవుడు మనతో ఎల్లప్పుడు వుండాలంటే మనము కూడ పరిశుద్ధంగా, అనగా మన శరీరము పరిశుద్ధాత్ముడు నివసించేదానికి యోగ్యమైనంత పవిత్రంగా, పరిశుద్ధంగా వుంచుకోవాలి. శరీరానుసారముగా ప్రవర్తించేవారి విషయములో పరిశుద్ధాత్ముడు నిలిచివుండడు అనేది వాస్తవం. రోమా 8:8 కాగా శరీరీ స్వభావము గలవారు దేవుని సంతోషపర్చునేరరు. దేవుని ఆత్మ మీలో నివసించుచున్న ఎడల మీరు ఆత్మ స్వభావముగలవారే వాని శరీర స్వభావము గలవారు కారు.

**7. పరిశుద్ధాత్మ యిచ్చు వరములు:-**

వీటిని కృపావరములు అని కూడ అనదగును. 1కొరిం. 12:7-11 వచనాల వరకు

1. ఆత్మ వలన బుద్ధి వాక్యము 2. జ్ఞాన వాక్యము 3. ఆత్మవలన విశ్వాసము 4. ఆత్మవలన స్వస్థ పర్చు వరము 5. అద్భుత కార్యములు చేయు శక్తి 6. ఆత్మ వలన ప్రవచన వరము 7. ఆత్మ వలన వివేచన వరము 8. ఆత్మ వలన అన్యభాషలు మాట్లడగల వరము 9. అన్య భాషలకు అర్ధము చెప్పగల్గే వరము. ఈ వరములన్ని యి పరిశుద్ధాత్ముని ద్వారా ఆయా వ్యక్తుల యొక్క ఆత్మయు స్థితి, విశ్వాస ప్రమాణముల అధారముగ యివ్వబడతవి అని గమనించాలి.

**8. ఆత్మ యొక్క ఫలాలు:-**

గలతి.5:22. 1. ప్రేమ 2. సంతోషము 3. సమాధానము 4. దీర్ఘశాంతము 5. దయాళుత్వము 6. మంచితనము 7. విశ్వాసము 8. సాత్వీకము 9. ఆశానిగ్రహము. ఒక విశ్వాసి పరిపూర్ణమైన ఆత్మ అభిషేకము కలిగిన వాడైయుంటే అట్టివాడు పొరుగువారిని ప్రేమించేవాడుగా నుంటాడు.

9. మత్త 7:7 అడుగుడి మీకివ్వబడును. యోహా 15:7 మీకేది యిష్టమో అడగండి యివ్వబడును అనేది ప్రభువు చేసిన వాగ్దానం. యిన్ని గొప్ప మేలులు అందించి, క్రీస్తుతో నిత్యత్వములో మనలను ఐక్యపర్చగల్గిన పరిశుద్ధాత్మను దయచేయుమని యేసుక్రీస్తు వారిని కోరుకుందాము.

## పాఠకులకు విజ్ఞప్తి!

**'పరిశుద్ధత'** మాసపత్రికను మీరు ఎంతగానో ఆదరిస్తున్నందుకు మీకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనప్పటికీ గత 20 సంవత్సరముల నుండి నడిపించగలగటం దేవుని కృప వలన మాత్రమే సాధ్యమవుతుంది. ఇప్పటి వరకు మేము సంవత్సర చందా విషయంలో పాఠకుల మీద ఎలాంటి వత్తిడి తీసుకురాలేదు. చందా కట్టినా కట్టక పోయినా మేము పత్రిక ఆపలేదు. ఎందుకంటే ఈ మా సాహిత్య సేవలో మేము ఆత్మల రక్షణకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాము. అయితే పాఠకుల దగ్గర నుండి కొన్ని పత్రికలు వెనక్కు వస్తున్నాయి. కావున పాఠకులు దయచేసి వారి అడ్రసు మారిన యెడల మాకు తెలియజేయ వలసినదిగా కోరుచున్నాము.

పనుల వత్తిడి వల్లకాని, ఇతరత్రా కారణాలవల్ల కాని పత్రిక చదివే సమయం లేనట్లయితే, మీరు కోరిన వారికి ఆ పత్రికను పంపగలము లేదా పత్రిక అవసరం లేదని పోస్టుకార్డు ద్వారా కాని పత్రిక అడ్రసు మీద ఉండే సీరియల్ నంబరును ఎస్.యం.ఎస్. ద్వారా కాని (9440217726 నంబరుకు) తెలియజేయగలరు. ఈ సంచికతో పాటు లేదా వచ్చే సంచికతో పాటు వచ్చే పోస్టుకార్డును ఉపయోగించుకొని, మీకు పత్రిక అవసరమా?/అవసరము లేదా? లేక పత్రికను ఎవరికైనా పంపవలెనా? అను సమాచారము తెలియజేస్తూ పోస్టు కార్డును మాకు పంపినచో మేము మీ కోరిన విధముగా చేయగలము. కావున పాఠకులు మాతో సహకరించ వలసినగా ప్రభువు పేరట కోరుచున్నాము.

**-ఎడిటర్**

# దేవుడు పండుగల ద్వారా మాట్లాడుతాడు



బ్రదర్ కె. సామ్రాట్

ఈ దినము మనము క్రైస్తవులముగా పుట్టినందుకు విమోచన కలుగుట లేదు కాని క్రీస్తుప్రభువు చిందించిన రక్తాన్ని బట్టి మనకు విమోచన కలుగుతుంది. మనము మన పాపముల విషయమై పశ్చాత్తాపపడి, ప్రభువైన యేసు క్రీస్తును స్వంత రక్షకునిగా అంగీకరించినప్పుడు మనకు రక్షణ కలుగుతుంది. అప్పుడు యేసురక్తము మనప్రతిపాపము నుండి పవిత్రులనుగా చేస్తుంది. పస్కాపండుగ ఆచరణలో చూపిన విధముగా దేవుడు తన విమోచన ప్రణాళికను తగిన సమయంలో నెరవేర్చాడు.

**పులియని రొట్టెల పండుగ:**

ఈ పండుగ పస్కా పండుగ మరుసటి దినము నుండి ప్రారంభమవుతుంది. ఏడుదినముల పాటు ఇశ్రాయేలీయులు పులియని అనగా ఏ పొంగు కలుపబడని రొట్టెలను తిను చుండవలెను. వారి ప్రాయశ్చిత్తానికై, దేవునితో సమాధానపడు టకై, పాపక్షమాపణకై, ప్రజలు ఈ ఏడు దినాల్లో ప్రతిదినము దేవుని సన్నిధికి చేరవలసి వుంటుంది. ఈ పండుగ రెండు అవసరతలను గుర్తింప జేస్తుంది. ఒకటి ఏమనగా విశ్వాసి తప్పక పాపము, మరణముల బానిసత్వమునుండి విడిచి వెళ్ళవలసిన అత్యవసరత. గొప్ప తొందరపాటుతో ఏవిధ ముగా దేవుని ప్రజలు ఐగుప్తును వదిలిపెట్టుటకు పండుగ ఒత్తిడి చేసిందో, అదే విధంగా ఈ దినము దేవుని ప్రజలు విడుదల పొంది స్వేచ్ఛతో దేవుని సేవించే అత్యవసరతలో ఉన్నారు.

రెండవ తలంపు ఏమనగా, ఎవరైతే పస్కా గొఱ్ఱెపిల్ల మరణము ద్వారా విమోచింప బడినారో వారందరు, వారు జీవించు దినములన్నింటిలో "పులిసినది" దేనిని అనుమ తించకుండా జాగ్రత్త కలిగి యుండాలి. ఈ పండుగ దినములన్నింటను ఇశ్రాయేలీయులు నివాసములలో ప్రతి గదిలో పులిసింది ఏదైనా వదిలిపెట్టబడిందేమోనని పరీక్షించు కొనుట వారి ఆచారము. లేఖనములలో "పులియుట" అనేది చెడుతనమునకును, దుష్టత్వమునకును సూచనగా ఉంది. పౌలు ఈ విషయాన్ని 1 కొరింథి 5:6-8లో చాలా బాగా వివరిస్తాడు: "పులిసిన పిండి కొంచెమైనను, ముద్దంతయు పులియజేయునని మీరెరుగరా? మీరు పులిపిండి లేనివారు గనుక క్రొత్త ముద్ద అవుటకై ఆ పాతదైన పులిపిండిని తీసి పారవేయుడి. ఇంతేకాక క్రీస్తు అను మన పస్కా పశువు వధింపబడెను. గనుక పాతదైన పులిపిండితోనైనను దుర్మా ర్గతయు దుష్టత్వమునను పులిపిండితోనైనను కాకుండా, నిష్కాపట్యమును సత్యమునను పులియని రొట్టెతో పండుగ ఆచరింతము". ప్రభువు యొక్క మరణ భూస్థాపన, పునరుత్థా నమునందు ఆయనతో పాలి భాగస్థులైన తన ప్రజలు తమ అనుదిన జీవితములో ఏ పాపమునైనను అనుమతించకుండా జాగ్రత్త కలిగి యుండవలెనని దేవుడు ఈ పండుగ ద్వారా వివరించుచున్నాడు. "ఒకని యెదుట సరియైనదిగా కనబడు మార్గము కలదు, అయితే తుదకు అది మరణమునకు త్రోవ తీయును" (సామెతలు 14:12). మనము ప్రతిదినము దేవునివాక్యపు వెలుగులో మన జీవితములను పరీక్షించుకోవాలి (1 కొరింథీ 11:28). 139వ కీర్తనలోని దావీదు ప్రార్థన ఈ విషయాన్ని బోధిస్తుంది. "దేవా, నన్ను పరిశోధించి నా హృదయమును తెలిసికొనుము నీ కాయాస కరమైన మార్గము నాయందున్నదేమో చూడుము నిత్య మార్గమున నన్ను నడిపించుము". (వ 23,24)

**(సశేషం)**

# యేసు మరణించి తిరిగి లేచాడు



డా. కె.విక్రాంత్

మనం బైబిలు చదవడం మొదలుపెట్టినపుడు బైబిలు జరిగిన చరిత్ర అనే సత్యాన్ని నేర్చుకున్నాము. చరిత్ర అంతటికి కేంద్రబిందువు యేసుక్రీస్తే ఆయన గాథ వాస్తవమైనది. మరొక తమ నాయకుణ్ణి గురించి మనం చదవడంలేదు. కుమారుడైన దేవుడు మన రక్షకుడుగా ఉండేందుకు ఈలోకానికి వచ్చిన సర్వశక్తిమంతుడు అయిన దేవుణ్ణి గురించి మనము చదువు తున్నాము. శతాధిపతి అంటే వందమంది సైనికులపై అధికారి.

ఆయనకెదురుగా నిలచియున్న శతాధిపతి ఆయన ఈలాగు ప్రాణము విడచుట చూచి - నిజముగా ఈ మను ష్యుడు దేవుని కుమారుడే అని చెప్పెను. కొందరు స్త్రీలు దూరము నుండి చూచుచుండిరి. వారిలో మగ్దలేనే మరియయు చిన్న యాకోబు యేసే అనువారు తల్లియైన మరియను, సలోమియు ఉండిరి. ఆయన గలిలయలో ఉన్నప్పుడు వీరాయనను వెంబ డించి ఆయనకు పరిచారము చేసినవారు. వీరు కాక ఆయనతో యెరూషలేమునకు వచ్చిన ఇతర స్త్రీలనేకులును వారిలో ఉండిరి. మార్కు 15:39-41.

దేవుని వాక్యంపై నమ్మకముంచిన ఈ స్త్రీలు వాగ్దానం ప్రకారము వచ్చిన రక్షకుడు యేసేనని నమ్మారు.

ఆ దినము సిద్ధపరచు దినము. అనగా విశ్రాంతి దినమునకు పూర్వదినము. గనుక సాయంకాలమైనప్పుడు అరిమతయి యోసేపు తెగించి, పిలాతునొద్దకు వెళ్ళి యేసు దేహము (తనకిమ్మని) అడిగెను అతడు ఘనత వహించిన యొక సభ్యుడై. దేవుని రాజ్యము కొరకు ఎదురుచూచువాడు. పిలాతు ఆయన ఇంతలోనే చనిపోయెనా అని ఆశ్చర్యపడి ఒక శతాధిపతిని తన యొద్దకు పిలిపించి. ఆయన ఇంతలోనే చనిపోయెనా అని అడిగెను. శతాధిపతి వలన సంగతి తెలుసుకొని యోసేపునకు ఆ శవమునప్పగించెను. అతడు నారబట్ట కొని ఆయనను దింపి, ఆ బట్టతో చుట్టి బండలో తొలిపించిన సమాధియందు పెట్టి ఆ సమాధి ద్వారమునకు రాయి పొర్లించెను. మార్కు 15:42-46.

యేసు సమాధి చేస్తునప్పుడు కూడ ప్రవచనం నేరవేరింది. అరిమతయి యోసేపు ధనికుడు. యోసేపునకు చెందిన సమాధి గుహలో యేసును సమాధి చేశారు. అతడు మరణమైనప్పుడు భక్తిహీనులతో అతని సమాధి నియమింపబడెను. ధనవంతుని యొద్ద అతడు ఉంచబడెను. నిశ్చయముగా అతడు అన్యాయమేమియు చేయలేదు. అతనినోట ఏకపటమును లేదు. యెషయా 53:9.

దేవుని వాక్యంలో యెషయా చెప్పిన మరొక ప్రవచనం నెరవేరింది. యేసు చనిపోయి మూడు పగళ్ళు మూడు రాత్రులు సమాధిలో ఉన్నాడు. వారం మొదటి దినాన ఉదయం యేసులో నమ్మకముంచిన స్త్రీలు, యేసును సమాధి చేసినప్పుడు ఉన్న ఆ స్త్రీలు సమాధి దగ్గరకు వచ్చారు. ఆదివారమున తెల్లవారు చుండగా ఆ స్త్రీలు తాము సిద్ధపరచిన సుగంధ ద్రవ్యములను తీసుకొని సమాధి యొద్దకు వచ్చి.... లూకా 24:1.

సమాధి చేసే ముందు సువాసన ద్రవ్యాలను శవానికి పూయడం యూదుల ఆచారం. కాని యేసును త్వరత్వరగా సమాధి చేసేశారు. యూదులు పస్కా ఆచారం హడావుడిలో ఉన్నారు. యేసు శరీరానికి సుగంధ ద్రవ్యాలు పూయడానికి సమయం లేకపోయింది.

తరువాత దినం విశ్రాంతి దినం గనుక వారు ఏపని చేయకూడదు. అందుకని ఆయన దేహానికి సుగంధ ద్రవ్యాలు పూయడానికి వారం మొదటి రోజు వరకు ఆగవలసి వచ్చింది. యేసు దేహానికి సుగంధ ద్రవ్యాలు పూయడానికి ఆదివారం తెల్లవారుజామునే ఈ స్త్రీలు వచ్చారు. దేహం సమాధిలోనే ఉందనుకుంటున్నారు. కాని వారికి గొప్ప షాక్ తగిలింది.

సమాధి ముందర ఉండిన రాయి దొరలింపబడి యుండుట చూచి లోపలికి వెళ్ళిరి. లూకా 24:2. యేసు దేహాన్ని సమాధిచేసినచోట సమాధికి అడ్డంగా పెట్టిన బరువైన రాయి దొర్లించి వేయడానికి దేవుడు తన దూతను పంపించాడని స్త్రీలకు తెలియదు. ప్రభువైన యేసు దేహము వారికి కనబడలేదు. ఇందును గూర్చి వారికేమియు తోచకయుండగా, ప్రకాశమానమైన వస్త్రములు ధరించిన ఇద్దరు మనుష్యులు వారియొద్ద నిలువబడిరి. లూకా 24:3,4.

యేసు దేహం సమాధిలో లేదు. వారి షాకుకు తోడు ఇద్దరు

దూతలు వారిని పలకరించారు. దేవదూతలు వారికేమి చెప్పారో చూడండి. "వారు భయపడి ముఖములను నేలమోపియుండగా వీరు సజీవుడైన వానిని మీరెందుకు మృతులలో వెదకుచున్నారు. ఆయన ఇంక గలిలయలో ఉండినప్పుడు – మనుష్యకుమారుడు పాపిష్టులైన మనుష్యుల చేతికి అప్పగింపబడి, సిలువవేయబడి, మూడువ దినమున లేవవలసియున్నదని ఆయన మీతో చెప్పిన మాట జ్ఞాపకము చేసికొనుడని వారితో అనిరి. లూకా 24:5–7.

యేసు తాను చెప్పినట్టే తిరిగి బ్రతికాడు. యేసు దేవుడు మనలను సాతాను పాప మరణాలనుండి విడిపించడంకోసం ఈలోకానికి మనిషిగి వచ్చాడు. మన విడుదల కోసం తన ప్రాణం ఇయ్యవలసి ఉంటుందని పరలోకాన్ని వదలి రాకమునుపే ఆయనకు తెలుసు. తాను తిరిగి బ్రతుకుతాననీ ఇక మరెన్నటికీ చనిపోనని కూడ తెలుసు. ఎందుకనగా నీవు నా ఆత్మను పాతాళములో విడచిపెట్టవు. నీ పరిశుద్ధుని కుళ్ళుపట్టనియ్యవు. కీర్తన 16:10. కీర్తనలోని ఈ వచనంలో యేసు తిరిగి బ్రతుకుతాడని దావీదు ప్రవచించాడు. దేవుని వాక్యంలోని ఈ మాట ఇక్కడ నెరవేరుతున్నది.

అప్పుడు వారాయన మాటలు జ్ఞాపకము చేసికొని సమాధి యొద్దనుండి తిరిగి వెళ్ళి ఈ సంగతులన్నియు పదకొండుగురు శిష్యులకును తక్కిన వారికందరికిని తెలియజేసిరి. ఈ సంగతులు అపోస్తులతో చెప్పిన వారెవరనగా. మగ్దలేనే మరియయు, యోహన్నయు, యాకోబు తల్లియైన మరియయు వారితోకూడ ఉన్న ఇతర స్త్రీలును, అయితే వారి మాటలు వీరి దృష్టికి వెఱ్ఱిమాటలుగా కనబడెను. గనుక వీరు వారి మాటలు నమ్మలేదు. అయితే పేతురులేచి సమాధి యొద్దకు పరుగెత్తుకొనిపోయి వంగిచూడగా నారబట్టలు మాత్రము విడిగా కనబడెను. అతడు జరిగిన దానిని గూర్చి ఆశ్చర్యపడుచు ఇంటికి వెళ్ళెను.

ఇదిగో ఆ దినమందే వారిలో ఇద్దరు యెరూషలేమునకు ఆమడ దూరమున ఉన్న ఎమ్మాయి అను ఒక గ్రామమునకు వెళ్ళుచు జరిగిన ఈ సంగతులన్నిటిని గూర్చి ఒకరితోనొకరు సంభాషించుచుండిరి. వారు సంభాషించుచు ఆలోచించుకొనుచుండగా యేసు తానే దగ్గరకు వచ్చి వారితో కూడ నడిచెను. అయితే వారాయనను గుర్తుపట్టలేకుండా వారి కన్నులు మూయబడెను. ఆయన – మీరు నడచుచు ఒకరితోనొకరు చెప్పుకొనుచున్న ఈ మాటలేమని అడుగగా వారు దుఃఖముఖులై నిలిచిరి. లూకా 24:8–17.

ఆయన శిష్యులంతా ఆయన తిరిగి బ్రతుకుతాడని ఎదురుచూస్తు ఉండవలసింది. ఆయన చనిపోకముందు చాలాసార్లు ఆయన తన మూడవరోజున తిరిగి బ్రతుకుతానని చెప్పాడు. వారు దానిని అర్థం చేసుకోలేదు లేదా సమాధిలోనుండి సజీవంగా బయటకు రావడం అసాధ్యమనైనా భావించారు. అయితే అది ఎంత అసాధ్యమైనప్పటికి దేవుడు మాత్రం తాను ఇచ్చిన మాట ఎప్పుడు నిలబెట్టుకుంటాడు.

యేసును దేవుడు తిరిగి బ్రతికించాడు కాబట్టి యేసు దేవుని కుమారుడని, వాగ్దానం ప్రకారం వచ్చిన రక్షకుడని మనము ఖాయంగా తెలుసుకోవచ్చు. యేసు తాను దైవకుమారుడనని, విమోచకుడనని చెప్పుకున్నాడు. కాబట్టి యూదా నాయకులు ఆయన్ను సిలువ వేశారు. అయితే యేసు తాను ఏమని చెప్పుకున్నాడో అది నిజమేనని అందరు గ్రహించే విధంగా దేవుడు ఆయనను మళ్ళ బ్రతికించాడు.

మన పాపాల కోసం యేసు చెల్లించిన వెలతో దేవుడు పూర్తిగా సంతృప్తి చెందాడు. యేసు చనిపోకముందు "సమాప్తమైనది" అనడం గుర్తుందా? అప్పుడు దేవుడు ఆలయం తెరను పైనుండి క్రిందకి చింపివేశాడు. తన యొద్దకు దారి ఇపుడు తెరుచుకందని, యేసురక్తం మూలంగా, పాపానికి పూర్తి వెల చెల్లించడం జరిగిందనీ చూపించడం కోసం దేవుడు ఇలా చేశాడు. యేసు రక్తం ద్వారా మన పాపాలకు వెల చెల్లించిన దానితో దేవుడు తృప్తిచెందాడు అని మనలకు ధైర్యం కలుగజేసేది మరొకటి ఉంది.

దేవుడు యేసును తిరిగి బ్రతికించాడు. యేసు చెల్లించిన దానితో దేవుడు పూర్తిగా తృప్తిచెందకపోతే ఆయన యేసును తిరిగి బ్రతికించేవాడు కాదు. యేసు తాను అంటూ ఏ పాపము చేయలేదు. మన పాపాలను పూర్తివెల చెల్లించే భాధ్యత తనపై వేసుకున్నాడు. దేవుడు మనలను స్వీకరించాలంటే మన పాపాల కోసమైన పూర్తివెల చెల్లబాటుకావాలి. న్యాయాధిపతి అయిన దేవుని ఎదుట యేసు మన స్థానం తీసుకున్నాడు. మనకు బదులుగా దేవుడు ఆయనను శిక్షించాడు.

న్యాయాధిపతి అయిన దేవుడు పూర్తిగా తృప్తిచెందేలా యేసు పూర్తి వెల చెల్లించాడని మనకెలా తెలుసు? యేసును చావు నుండి విడిపించి తిరిగి బ్రతికించడం ద్వారా ఇక చెల్లించవలసింది ఏమిలేదని దేవుడు చూపించాడు. న్యాయాధిపతియైన దేవుడే తృప్తి చెందకపోయినట్టయితే ఆయన యేసును మరణం నుండి విడిపించేవాడు కాదు.కాబట్టి సాతాను, పాప మరణాల నుండి, దేవునిలో శాశ్వత ఎడబాటు నుండి నీవెలా తప్పించుకోగలవు?

యేసు ప్రభువులో పూర్తిగా నమ్మకం పెట్టుకోవాలి. నీ పాపాల కోసం పూర్తి చెల్లింపుగా ఆయన తన రక్తం చిందించాడని నీకు శాశ్విత జీవమిచ్చేందుకు తిరిగి లేచాడని విశ్వసించాలి.

# జాన్‌వెస్లీ



శ్రీమతి రిబ్కా విక్రాంత్

1791 మార్చి 9వ తేదీన జాన్‌వెస్లీ మృతదేహాన్ని సమాధి చేశారు. అతడు ఈ లోకంలో వదిలి వెళ్లినవి మంచి పుస్తకాలు కొన్ని వాడకం వల్ల బాగా నలిగిన పాష్టరు గౌను గిట్టనివారి విమర్శల మూలంగా మసిబారిన పేరు ప్రఖ్యాతులు. అతడు మరొకదాన్ని కూడా వెనుక విడిచి వెళ్ళాడు. పునాదుల వరకు కదలిపోయిన ఇంగ్లండు దేశం, జాగృతమైన ఆధ్యాత్మిక జీవనంలో పులకరింతలు పోతున్న క్రైస్తవ సంఘం. విస్తారంగా అపోస్తలిక దృష్టి వరాలు కలిగిన వ్యక్తి వెస్లీ. అన్నిటికన్నా ముఖ్యంగా నిత్యత్వపు దృక్పథంలో అతడు జీవించాడు. కాలం కొంచెమేనన్న ఆలోచన, చేయవలసిన పని ఎంతో ఉన్నదన్న ఆవేదన చేయాలన్న ఆవేశం వీటితో అతడు కదం తొక్కుతూ, బోధిస్తూ బ్రతిమాలుతూ, హెచ్చరిస్తూ, దారిచూపుతూ కదిలాడు. విశ్వాసంలోను, విజ్ఞానంలోనూ మహా వీరుడు వెస్లీ. అనేక మార్లు దయ్యాలు పట్టిన వారిని అతని దగ్గరికి తెస్తే అతని ప్రార్థనకు జవాబుగా దయ్యాలు పారిపోయాయి. దయ్యాలు వెళ్ళడమే కాదు. రోగులు స్వస్థపడ్డారు. వెస్లీ ఉపన్యసిస్తుంటే శ్రోతలమీదికి దైవశక్తి దిగివచ్చేది. పరిశుద్ధాత్మ శక్తి క్రిందికి వందలమంది వచ్చేవారు. ప్రార్థనకు జవాబుగా వారి దేహాలకు, ఆత్మలకు స్వస్థత లభించేది. దేవుని శక్తికిలోనై కేకలు పెడుతున్నవారిని చూచి ఒక వైద్యునికి అభ్యంతరం కలిగింది. అతడు వెస్లీ మాట్లాడుతున్న మీటింగుకి వచ్చాడు. అతనికి తెలిసిన ఒకామె దైవశక్తికిలోనయింది. పెద్ద పెద్ద చెమట బిందువులు ఆమె ముఖం నుండి పడ్డాయి. ఆమె ఎముకలన్నీ వణికాయి. ఆమె దేహమూ, ఆత్మా, స్వస్థత పొందినప్పుడు ఒక్క క్షణంలో ఆ వైద్యుడు దేవుని హస్తాన్ని గుర్తించాడు. మరొకసారి వెస్లీ సువార్త యాత్రలో ఉండగా అనుకోకుండా అతని గుర్రంకాలు బెణికింది. ఆదుకొనేందుకు అక్కడెవ్వరూ లేరు. అతడు గుర్రం దిగి ప్రార్థించగానే కాలు మామూలుగా అయిపోయింది.

పశ్చాత్తాపబడి దేవునితో సమాధానపడవలసిందని, లేకుంటే శాశ్విత నరకం తప్పదని వెస్లీ అందరిని బ్రతిమాలేవారు. పాప విముక్తి తనకు ఉందని అబద్ధపు ఆశలు పెట్టుకున్నవారికి అతని సూటియైన వాక్యబోధ మూలంగా వారి మత ముసుగులు తొలగిపోయేవి. పాపులను వెనుకతీసినవారిని హెచ్చరించనివారు తామే క్రీస్తు ఎదుట తీర్పులో నిలబడవలసి ఉంటుందని వెస్లీ నమ్మాడు. క్రీస్తులో దేవుని ప్రేమను బోధిస్తూ, సువార్తను తిరస్కరిస్తే కలిగే దురవస్థల గురించి హెచ్చరికలు ఇస్తూ దేవుని మనసంతటిని శ్రోతలకు వెల్లడి చేసేవాడు. ప్రేమ కృపల గురించి బోధించకముందు పాపం, ధర్మశాస్త్రం తీర్పుల గురించి నేను బోధించవలసి ఉంది. అని అతడు వ్రాశాడు.

జాన్ వెస్లీ, ఇతర మెతడిస్టు బోధకుల పరిశుద్దీకరణ గురించి ధైర్యంగా బోధించడమేగాక, తాము అందుకు ప్రతీకలుగా ఉండేవారు. క్రీస్తులో చైతన్య పూరితమైన విశ్వాసం యొక్క ఫలితం సంపూర్ణ పవిత్రజీవనం అని వెస్లీ అవిశ్రాంతమైన తీవ్రతలో బోధించాడు. వేరొక బోధకునికి సలహా ఇస్తూ వెస్లీ ఇలా రాశాడు. "పాపంనుండి పరిపూర్ణమైన రక్షణలోకి సాగాలని విశ్వాసులను నీవు గట్టిగా వత్తిడి చేయకుండా ఎలాంటి ఉజ్జీవము రాదు". తన 83వ యేట వెస్లీ తాను రోజులో 15 గంటలకంటే ఎక్కువ సమయం రాయలేకపోతున్నానని, కన్నులు సహకరించడం లేదని చెప్పాడు. తన మరణ దినం వరకు అతడు నమ్మకంగా సువార్త ప్రకటించాడు. తన సమయ విషయంలో అతడు అంత గొప్ప బాధ్యత కలిగి ఉండడమే వృద్ధాప్యంలో అతని ఉత్తేజానికి ఆత్మ తీవ్రతకు కారణం ప్రతి తలంపు మాట, చర్చ కూడా నిత్యత్వం దృక్పదంలోనే అతడు చూచేవాడు.

అతడు చేసిన కాయకష్టం, అసంఖ్యాకమైన పనిపాటులు రాకపోకలు అన్నిటి మధ్యా వెస్లీకి దేవునిలో రహస్యమైన సన్నిహిత జీవనం ఉంది. పని ఎక్కువై అలసిపోయినప్పుడు ప్రార్ధనలో ఉండి నూతన బలాన్ని అతడు పుంజుకునేవాడు. ఉదయం ఒక గంట సాయంత్రం ఒక గంట ప్రార్థనలో ఉండడమనేది తన జీవితమంతా వెస్లీ ఖచ్చితంగా అమలు పరచిన దినచర్య. అతడు మొదట తన ప్రార్థనలో పరలోకాన్ని, నరకాన్ని కంపింపచేశాడు. గనుకనే తన బోధనలతో ప్రపంచాన్ని కంపింపజేయగలిగాడు. అతని బోధలలో నిత్యత్వానికి చెందిన ఒక అద్భుత కనిపించేది. అందుకు కారణం తన మోకాళ్ళపై అతడు అనునిత్యం ఆ నిత్యత్వాన్ని స్పర్శించడమే.

## STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS OF PARISHUDDATHA MONTHLY

| | | | |
|---|---|---|---|
| 1. | Place of Publication | : | ONGOLE |
| 2. | Periodicity of its Publication | : | Monthly |
| 3. | Printer's Name | : | D. Siva Prasad |
| | (Whether Citizen of India) | : | Indian |
| | Country of Origion/Address | : | Trunk Road,<br>Ongole - 523 001 |
| 4. | Publisher's Name | : | K. Joseph |
| | (Whether Citizen of India) | : | Indian |
| | Country of Origion/Address | : | Krupadanam Street,<br>Cloughpet,<br>Ongole - 523 001 |
| 5. | Editor's Name | : | K. Joseph |
| | (Whether Citizen of India) | : | Indian |
| | Country of Origion/Address | : | Krupadanam Street,<br>Cloughpet,<br>Ongole - 523 001 |

I, K. Joseph hereby declares that the particulars given above are true to the best of my knowledge and belief.

Date : 12-03-2015

(Sd.) ***K. Joseph***
Signature of the Publisher

13వ పేజీ తరువాయి....

బాప్తిస్మము తీసుకున్నాము. మా పాప స్వాతి ఇప్పుడు బి.టెక్. ఫైనల్ ఇయర్ చదువుచున్నది. మా బాబు చైతన్య రామకుమార్ ఇంటర్ చదువుతున్నాడు. వారిద్దరికి యేసు ప్రభువు మీద ఎనలేని ప్రేమ వుంది. వారిద్దరూ రక్షణ పొంది బాప్తిస్మము పొంది యున్నారు. వారి స్నేహితులకు కూడా యేసుప్రభువు ప్రేమను గురించి చెప్పటం సంతోషము.

మేము ప్రతి వారం ఇంగ్లీషు ఆరాధనకు వెళ్తున్నాము. అప్పటి నుండి ఇప్పటి వరకు ఒక్కసారి అయినా ఆగలేదు. యేసుని ప్రేమను రూచి చూచిన తర్వాత చాల సంతోషంగా వున్నాము. నేను మా అక్కగారిని కూడ దేవునిలోనికి నడిపించాను. ఆమె కూడ రక్షణ పొందారు. అనుకోకుండా నా పెండ్లి అయిననాటికి మా పెద్ద ఆడపడుచుగారు దేవుని రక్షణలోనికి వచ్చారు. తరువాత మా అత్తగారు, మామగారు కూడ రక్షణలోనికి వచ్చారు. వారు కొమ్ముగూడెం గ్రామములో దేవుని సహాయంతో ఒంటరిగా జీవిస్తున్నారు. ఎప్పటికైనా మా బంధువులందరూ సత్యము తెలుసుకొని రక్షణ పొందాలని నా అభిలాష.

## ప్రకటన

**క్రైస్తవ కథలు, వ్యాసాలు, రచనలు, కవితలు, పాటలు మొదలగునవి మా ప్రియ పాఠకుల నుండి కోరడమైనది. ఆసక్తి గలవారు తమ తమ భావాలను మా పత్రిక ద్వారా పాఠకులకు అందించవచ్చు. ఉత్తమ కథకు ప్రతినెల రూ. 58/- ల నగదు బహుమానం వుంటుంది. క్రైస్తవ కథ ఏదైనా 2 పేజీలకు మించకూడదు.**

## బైబిల్ క్విజ్ - 6 జవాబులు

1. యోసేపు
2. పొడలు, మచ్చలుగల గొఱ్ఱెలు, మేకలు
3. చినారు, జింగిసాలు
4. గొఱ్ఱెల బొచ్చు కత్తిరించుటకు
5. రాహేలు
6. విగ్రహాలు ఒంటె సామాగ్రిలోపెట్టి వాటి మీద కూర్చుండెను
7. యగర్ శాహదూత లేదా గలేదు
8. ఎదోము దేశమున అనగా శేయీరు దేశమున
9. 400 మందితో
10. రెండు
11. ఇశ్రాయేలు
12. పెనూయేలు
13. షెకెము
14. షెకెము
15. షిమ్యోను, లేవి
16. దెబోరా
17. బెనోని
18. బెన్యామీను
19. 13 మంది
20. 150 సంవత్సరములు
21. యోసేపును
22. విచిత్రమైన నిలువుటంగీ
23. చెడుతనమును గూర్చిన సమాచారము
24. యోసేపు కనిన కలల నిమిత్తము
25. రెండు కలలు

**గత నెల విజేతలు :**

సాంబశివరావు-చిలకలూరిపేట,
కృపమ్మ-సంతమాగులూరు
మార్టిన్‌లూథర్-కాకినాడ
సత్యవతి-ఏలూరు



# అక్షరయజ్ఞం



## బైబిల్ క్విజ్ - 7

శ్రీమతి కె. ప్రసన్న పరాక్రమ్

1. అన్నల క్షేమ సమాచారము తెలిసికొనుటకు యాకోబు యోసేపును ఎక్కడికి పంపెను?
2. అన్నల కొరకు వెదకుచుండగా వారు ఎక్కడికి వెళ్ళారని తెలుసుకొనెను?
3. యోసేపును చంపాలన్న ఆలోచనను ఏ సహోదరుడు అడ్డుకొనెను?
4. యోసేపును అమ్మివేయాలన్న ఆలోచనను ఏ సహోదరుడు చెప్పెను?
5. వారు యోసేపును ఎవరికి, ఎంతకు అమ్మివేసెను?
6. ఇష్మాయేలీయులు యోసేపును ఐగుప్తు దేశములో ఎవరికి అమ్మిరి?
7. పోతీఫరు ఫరో దగ్గర ఏ ఉద్యోగము చేయుచుండెను?
8. యూదా కోడలు పేరేమి?
9. తామారునకు పుట్టిన కవల పిల్లల పేర్లేమి?
10. యోసేపు చెరసాలలో ఉన్నప్పుడు ఫరో యొక్క ఏ ఉద్యోగస్థులు అతనితో కూడా ఉండిరి?
11. ఏ ఉద్యోగస్థుని ఉద్యోగము మరల ఇప్పించబడెను?
12. యోసేపు చేసిన ఉపకారమును పానదాయకుడు ఎన్ని సంవత్సరములు మరచిపోయెను?
13. ఫరో ఎన్ని కలలు కనెను?
14. ఫరో కలలో కనిపించిన జంతువులు ఏవి? ఎన్ని జంతువులు కనిపించాయి?
15. ఫరో కనిన రెండవ కలలో ఏమి కనబడెను?
16. కలల భావము చెప్పినందుకుగాను ప్రతిగా ఫరో యోసేపుకు ఏమి చేసెను?
17. ఫరో యోసేపుకు ఏమని పేరు పెట్టను?
18. యోసేపు భార్య పేరేమి?
19. యోసేపు మామ పేరేమి?
20. యోసేపు పెద్ద కుమారుని పేరేమి?
21. యోసేపు చిన్న కుమారుని పేరేమి?
22. ఐగుప్తు దేశములో ఎన్ని సంవత్సరములు కరవు వచ్చెను?
23. ఫరో ఎదుట నిలిచినప్పుడు యోసేపు వయస్సెంత?
24. యోసేపు మామ ఏ దేవాలయమునకు యాజకుడు?
25. ఐగుప్తులో ధాన్యము కొనుటకు బయలుదేరిన యోసేపు అన్నలు ఎంతమంది?

**గమనిక :** ఈ ప్రశ్నలన్నిటికి సమాధానాలు బైబిలు నుండి గ్రహించవచ్చును. మీరు ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొనటం ద్వారా బైబిలు జ్ఞానమును సంపాదించాలన్నదే మా ఉద్దేశ్యం. కావున ప్రతి ఒక్కరూ ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొని బైబిలు జ్ఞానము సంపాదించటంతో పాటు బహుమతులు గెలుపొందవలసినదిగా కోరుచున్నాము.